ఐదేళ్ల అధోగతి..!

వైసీపీ పాలనలో ఆగిన అభివృద్ధి

- కదిరిలో పూర్తికాని మైనార్టీ విద్యాసంస్థలు
- అధ్వానంగా రాయచోటి, పులివెందుల రోడ్లు
- కలగా మిగిలిన ఈఎస్ఐ ఆస్పత్రి
- జాడలేని ఇండస్ట్రియల్ పార్కు
- పూర్తికాని హంద్రీనీవా కాలువ
- నేడు కదిరిలో సీఎం జగన్ పర్యటన



పూర్తికాని మైనార్టీ విద్యాసంస్థల భవనం

కదిరి

నియోజకవర్గంలో ఐదేళ్లుగా అభివృద్ధి ఆగిపోయింది. ముఖ్యమంత్రి జగన్ నియోజకవర్గం పులివెందుల పక్కనే ఉన్నా.. పలుమార్లు ఆయన అక్కడికి వచ్చినా ప్రయోజనం మాత్రం లేదని నియోజకవర్గ ప్రజలు నిట్టూరుస్తున్నారు. కదిరి అభివృద్ధికి ప్రత్యేకంగా ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నది బహిరంగ రహస్యమే. మైనార్టీ విద్యాసంస్థల నిర్మాణం పూర్తి చేయలేదు. మైనార్టీల్లో బీడీ కార్మికులు ఎక్కువగా ఉన్నా, వారికోసం ఈఎస్ఐ ఆస్పత్రి ఏర్పాటు చేయలేదు. కదిరి ప్రాంతానికి ఉపాధి ముఖ్యమైన సమస్య. దానిని తీర్చడానికి నిర్మిస్తామని చెప్పిన ఇండస్ట్రియల్ పార్కు మాయమైంది. హంద్రీనీవా మెయిన్ బ్రాంచ్ కెనాల్, టిడ్కో ఇళ్లు, సోలార్ రైతులకు పరిహారం, పట్టణంలో భూగర్భ మురుగునీటి కాలువ వంటి ఎన్నోహామీలు అమలుకు నోచుకోలేదు. మొత్తం మీద ఐదేళ్లుగా కదిరి అభివృద్ధి అటకెక్కింది.

పూర్తికాని మైనార్టీ విద్యాసంస్థలు

కదిరి ప్రాంతంలో మైనార్టీలు ఎక్కువగా ఉన్నారు. పట్టణంలో వీరి సంఖ్య 50వేల వరకు ఉంటుంది. మైనార్టీల పిల్లల విద్యాభివృద్ధికి అప్పటి టీడీపీ బాల బాలికల రెసిడెన్షియల్ కళాశాల, ఉర్దూ జూనియర్, పాలిటెక్నికల్ కళాశాలలు ఏర్పాటు చేసింది. రెండు రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణం 95 శాతం పూర్తి చేసింది. తర్వాత వైసీపీ అధికారంలోకి వచ్చింది. ఐదేళ్లవుతున్నా వైసీపీ పాలకులు.. మిగిలిన 5 శాతం పనులు పూర్తి చేయలేకపోయారు. ఉర్దూ పాలిటెక్నిక్, హాస్టళ్ల నిర్మాణ పనులు టీడీపీ హయాంలో 80శాతం పూర్తయ్యాయి. వైసీపీ పాలనలో అడుగు ముందుకు పడలేదు. ఉర్దూ లైబ్రరీ హామీ అమలుకు నోచుకోలేదు. మైనార్టీ విద్యార్థుల అభివృద్ధికి ప్రస్తుత ప్రభుత్వం చేసింది సున్నానే. టీడీపీ పాలనలో చేసిన అభివృద్ధి పనులే కనిపిస్తున్నాయి. మైనార్టీల పట్ల వైసీపీకి ఉన్న చిత్తశుద్ధికి ఇదే నిదర్శనం.

నేరవేరని ముఖ్యమంత్రి హామీ

జగన్ పాదయాత్ర సందర్భంగా నియోజకవర్గంలోని నంబులపూలకుంట బస్టాండు వద్ద సోలార్ రైతులకు పరిహారం పెంచి ఇస్తామని హామీ ఇచ్చారు. ఐదేళ్లవుతున్నా సోలార్ రైతులకు ఇంతవరకు పెంచిన పరిహారం అందలేదు. టీడీపీ హయాంలో ఎకరాకు రూ.రెండు లక్షలు ఇస్తే, తాను అధికారంలోకి రాగానే ఎకరాకు రూ.5 లక్షలు ఇస్తానని జగన్ హామీ ఇచ్చారు. ఇంతవరకు దాని ఊసే లేదు.

గొడ్డలి తయారీకి..

కదిరి అభివృద్ధికి వైసీపీ ప్రభుత్వం ఎటువంటి తోడ్పాటు అందించలేదు. పక్క నియోజకవర్గంలో వైఎస్ వివేకానందరెడ్డి హత్యకు ఉపయోగించిన గొడ్డలి కదిరిలో కొనుగోలు చేసినట్లు నిందితులు.. సీబీఐకి తెలిపారు. కదిరి హత్యలు చేయడానికి కావలసిన ఆయుధాల తయారీకి ఉపయోగపడేలా చేశారే తప్ప, ప్రజల అభివృద్ధికి చేసింది శూన్యమని ప్రజలు అంటున్నారు.

కన్నెత్తి చూడలేదు

సీఎం జగన్ సొంత నియోజకవర్గమైన పులివెందలకు పక్కనే కదిరి నియోజకవర్గం ఉంది. రెండు పట్టణాల మధ్య దూరం జస్ట్ 40 కిలోమీటర్లే. ముఖ్యమంత్రి పులివెందులలో చాలాసార్లే పర్యటించారు. కదిరి వైపు మాత్రం కన్నెత్తి చూడలేదు. మళ్లీ ఎన్నికలు వస్తుండడంతో ఇప్పుడు కదిరికి వస్తున్నారు. మైనార్టీలను మరోసారి మభ్య పెట్టడానికి కదిరికి వస్తున్నట్లు ఆ వర్గాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.

పూర్తికాని హంద్రీనీవా



హంద్రీనీవా ద్వారా నియోజకవర్గంలోని అన్ని చెరువులకు నీరు అందిస్తామని వైసీపీ పాలకులు హామీ ఇచ్చారు. టీడీపీ పాలనలో చేసిన పనులు తప్ప.. హంద్రీనీవా కాలువలో ఎటువంటి పురోగతి లేదు. హంద్రీనీవా మెయిన్ బ్రాంచ్ కెనాల్ ద్వారా తలుపుల, నంబులపూలకుంట మండలాలకు నీరు అందిస్తామన్న ప్రభుత్వ హామీ ఇంతవరకు నెరవేరలేదు. ఒక్క రూపాయి కూడా నిధులివ్వలేదు. దీంతో ఐదుశాతం పనులు పూర్తి చేయలేక ఆయా మండలాలకు సాగునీరు అందలేదు. ఇది పూర్తిగా ప్రభుత్వ నిర్లక్ష్యమే. గాండ్లపెంట మండలానికి హంద్రీనీవా నీటిని తీసుకు వస్తామని జీవో ఇచ్చిందే తప్ప.. కార్యరూపం దాల్చలేదు. ఇక్కడి చెరువులకు నీరివ్వకుండానే మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నియోజకవర్గానికి తీసుకెళ్లారు. దీంతో ఈ ప్రాంత రైతులు సాగునీరు లేక కరువుతో విలవిల్లాడుతున్నారు.



రాయచోటి రోడ్డు దుస్థితి

రోడ్లు అధ్వానం

వైసీపీ పాలనలో అభివృద్ధి కరువైందనడానికి రాయచోటి, పులివెందుల రోడ్ల దుస్థితే నిదర్శనం. మూడేళ్ల క్రితం ప్రారంభించిన కదిరి-రాయచోటి రోడ్డు నిర్మాణం అర్థంతరంగా ఆగిపోయింది. ప్రభుత్వం వీటికి నిధులివ్వకపోవడంతో పనులు ముందుకు కదలలేదు. దీంతో ప్రయాణీకులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సొంత నియోజకవర్గం పులివెందులకు వెళ్లే రహదారి అధ్వానంగా ఉంది. అడుగుకో గుంతతో ప్రయాణానికి వీలులేకుండా ఉంది. నాలుగులైన్ల రోడ్డు వస్తుందంటూ ఉన్న రహదారికి మరమ్మతులు చేయకుండా వదిలేశారు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



పడిపోయిన ఇండస్ట్రియల్ పార్కు బోర్డు

పారిశ్రామిక పార్కు ఏదీ..?

నియోజకవర్గంలో ప్రధాన సమస్య ఉపాధి. ఉపాధి లేక చదువుకున్నవారు, చదువుకోనివారు బెంగళూరు, హైదరాబాద్, తిరుపతి లాంటి నగరాలకు నిత్యం వలస వెళ్తుంటారు. పట్టుమని వందమంది పనిచేసే పరిశ్రమలు కూడా ఇక్కడ లేవు. ఉపాధి కల్పనకు పారిశ్రామిక పార్కు ఏర్పాటు చేస్తామంటూ వైసీపీ ఇచ్చిన హామీ అటకెక్కింది. ఆ ఊసేలేదు. భూసేకరణ చేసినప్పటికీ అందులో పనులు చేపట్టలేదు. దీంతో కదిరి ప్రాంత వాసులకు వలసలు తప్పలేదు.



దిష్టిబొమ్మలా టిడ్కో ఇళ్లు

పూర్తికాని టిడ్కో ఇళ్లు..

టీడీపీ హయాంలో నియోజకవర్గంలో 1100 టిడ్కో ఇళ్ల నిర్మాణం చేపట్టారు. 90 శాతం నిర్మాణ పనులు కూడా పూర్తయ్యాయి. వైసీపీ అధికారంలోకి వచ్చాక మిగిలిన 10శాతం పనులు కూడా పూర్తి చేయలేకపోయారు. దీంతో టిడ్కో ఇళ్లు అలానే ఉండిపోయాయి. ఉచితంగా ఇళ్లు కేటాయిస్తామన్న హామీ నేరవేరలేదు. రూ.18కోట్లతో పట్టణంలో ఆస్పత్రి భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఐదేళ్లు గడుస్తున్నా నిర్మాణం పూర్తికాలేదు. దీంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

నేడు జగన్ బస్సుయాత్ర

పుట్టపర్తి, మార్చి31(ఆంధ్రజ్యోతి): మేమంతా సిద్ధం బస్సు యాత్రలో భాగంగా సీఎం జగన్ సోమవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉమ్మడి అనంత జిల్లా పర్యటన ముగించుకుని శనివారం రాత్రి బత్తలపల్లి మండలం సంజీవపురం వద్ద బస కేంద్రం చేరుకున్న సీఎం జగన్ ఆదివారం యాత్రకు విరామం ప్రకటించారు. సోమవారం యాత్ర ఉదయం 9 గంటలకు కొనసాగించనున్నారు. బత్తలపల్లి, రాళ్లఅనంతపురం, ముదిగుబ్బ, మలకవేముల, పట్నం మీదుగా కుటాగుళ్లకు చేరుకుంటారు. అక్కడ మధ్యాహ్నం భోజన విరామం అనంతరం బయలుదేరి సాయంత్రం కదిరిలోని వీవీఆర్ ఫంక్షన్ హాల్‌లో ఇఫ్తార్ విందులో పాల్గొంటారు. అక్కడి నుంచి మోటుకపల్లె, జోగన్నపేట మీదుగా చీకటిమానిపల్లెలో ఏర్పాటు చేసిన బస కేంద్రానికి చేరుకంటారు.

ముస్లింలకు జగన్ తీవ్ర మోసం: కందికుంట



మాట్లాడుతున్న కందికుంట

కదిరి: ముస్లింలకు సీఎం జగన్ తీవ్ర మోసం చేశాడని టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి కదిరి అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ విమర్శించారు. మరోసారి ప్రజలను దగా చేయడానికే ముఖ్యమంత్రి బస్సుయాత్ర చేపట్టారని మండిపడ్డారు. స్థానిక తన నివాసంలో ఆయన ఆదివారం మాట్లాడుతూ ఇచ్చిన హామీలను నేరవేర్చకుండా రాష్ట్ర ప్రజలను జగన్ మోసం చేశాడన్నారు. ఎన్నో హామీలిచ్చి నెరవేర్చకుండా మాట తప్పి, మడమ తిప్పిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. ముస్లింలకు తీరని ద్రోహం చేశాడన్నారు. టీడీపీ హయాంలో మైనార్టీ విద్యార్థుల విదేశీ విద్య కోసం ఏటా రూ.పది లక్షలు ఇచ్చేవారన్నారు. వైసీపీ ప్రభుత్వం ఆ పథకాన్ని ఆపేయడంతో ఆ విద్యార్థులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇది మైనార్టీలకు చేసిన మోసం కాదా అన్నారు. దుల్హన్ పథకం కింద ఆడబిడ్డ పెళ్లికోసం రూ.50వేలు టీడీపీ హయాంలో అందించామన్నారు. ఈ పథకాన్ని వైసీపీ పాలకులు ఆంక్షలు వి ధించారన్నారు. రంజాన్ తోఫా ఇవ్వకుండా పేదలను పండుగకు దూరం చేశారన్నారు. మసీదుల మరమ్మతులు, సున్నాలకు టీడీపీ హయాంలో ప్రత్యేకంగా ని ధులిచ్చామన్నారు. ప్రస్తుతం రూపాయి కూడా విడుదల చేయలేదన్నారు. వీటన్నింటిపై సమాధానం చెప్పిన తర్వాతే ముఖ్యమంత్రి జగన్ కదిరిలో బస్సుయాత్ర చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో అభివృద్ధి జాడలేదు

టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీవీ



పుట్టపర్తి, మార్చి31(ఆంధ్రజ్యోతి): సీఎం జగన్ అసమర్థ, అవినీతి, అరాచకపాలనతో రాష్ట్రంలో అభివృద్ధి జాడలేకుండా పోయిందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీవీ వెంకటరాముడు పేర్కొన్నారు. ఆయన ఆదివారం ఓ ప్రకటనలో వైసీపీ పాలనపై విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో జగన్‌రెడ్డి రివర్స్ పాలనతో ప్రజల జీవితాలు రివర్స్ అయ్యాయన్నారు. దేశంలో అన్ని రాష్ట్రాలు అభివృద్ధిలో జెట్ స్పీడుతో ముందుకు దూసుకెళ్తుంటే జగన్ అసమర్థ పాలన కారణంగా ఏపీ చిట్టచివరి స్థానంలో నిలిచిపోయిందన్నారు. రాష్ట్రానికి మళ్లీ చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలన్నారు. అన్నివర్గాల సంక్షేమంతోపాటు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించే సత్తా చంద్రబాబు సొంతమన్నారు. ఎన్నికల్లో అన్నివర్గాల ప్రజలు టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థులకు మద్దతు పలికి, గెలిపించాలని ఆయన కోరారు.

ఇచ్చిన హామీలు ఎగ్గొట్టిన ఘనుడు జగన్

నాసిరకం మద్యంతో 35 లక్షల మంది అనారోగ్యం పాలు

బీకే పార్థసారథి ఫైర్



మాట్లాడుతున్న బీకే పార్థసారథి

హిందూపురం, మార్చి 31: సరిగ్గా ఐదేళ్ల క్రితం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో 85 శాతం ఎగ్గొట్టిన ఘనుడు జగన్ కాదా అని టీడీపీ హిందూపురం ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథి పేర్కొన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే నందమూరి బలకృష్ణ కార్యాలయం వద్ద ఆదివారం ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వారంలోపే సీపీఎస్ రద్దు చేస్తానని జగన్ హామీ ఇచ్చారనీ, అది ఏమైందని ప్రశ్నించారు. రాష్ట్రంలో మద్యపాన నిషేదం పూర్తిస్థాయిలో అమలు చేసి, ప్రస్తుత ఎన్నికల్లో ఓటడుగుతానని హామీ ఇచ్చిన జగన్.. వీధివీధినా బెల్టుషాపు పెట్టించాడన్నారు. నాసిరకం మద్యంతో రాష్ట్రంలో 35 లక్షల మంది అనారోగ్యం బారినపడి కిడ్నీలు చెడిపోయేలా చేసిన దుర్మార్గుడు జగన్ అంటూ మండిపడ్డారు. 'విద్యుత్ చార్జీలు పెంచమని చెప్పి తొమ్మిదిసార్లు పెంచి 64 వేల కోట్లు ప్రజలపై భారం వేసింది నీవు కాదా' అంటూ విరుచుకుపడ్డారు. వ్యవసాయ మీటర్ల పేరుతో 15 వేల కోట్లు దోపిడీ చేయలేదా అంటూ నిలదీశారు. మెగా డీఎస్సీని పూర్తిగా అటకెక్కించారన్నారు. ప్రత్యేక హోదా తెస్తామనీ, కేంద్రం మెడలు వంచైనా సాధిస్తామని గొప్పలు చెప్పిన జగన్.. ఐదేళ్లు ఏం పీకారని దుయ్యబట్టారు. రాష్ట్రంలో ఇసుక అక్రమ రవాణా ద్వారా రూ.50వేల కోట్లు దోచుకున్నది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. డీజిల్, పెట్రోల్ ధరలు తగ్గిస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని చెప్పి, వారిని మోసం చేసిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. ఉద్యోగులు దాచుకున్న సొమ్మును సైతం దోచుకున్న దుర్మార్గుడంటూ ధ్వజమెత్తారు. జగన్ అనే తుగ్లక్ రాష్ట్రాన్ని సర్వనాశనం చేశాడనీ, అనుభవం ఉన్న చంద్రబాబుకు పట్టం కట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ, ఉమ్మడి అభ్యర్థులను గెలిపించి, రాష్ట్రాన్ని కాపాడుకుందామన్నారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కన్నుపడితే బండి మాయం..!

పెరిగిన ద్విచక్రవాహన చోరీలు

రికవరీలో కనిపించని పోలీసు మార్కు

ఫిర్యాదు స్వీకరించేందుకూ విముఖత

హిందూపురం, మార్చి 31: పట్టణంలోని మేళాపురం సమీపంలో సరుకులు కొనుగోలు చేసేందుకు ద్విచక్రవాహనాన్ని పార్క్ చేసి దుకాణంలోకి వెళ్లిన వ్యక్తి, బయటకు వచ్చేసరికి బైక్ మాయమైంది. ఆ ప్రాంతంలో గాలించినా వాహనం దొరకలేదు. పోలీసులకు ఫిర్యాదు చేద్దామని వెళ్తే వారంరోజులపాటు సాకులు చెప్పి తిప్పుకున్నారు తప్ప.. ఫిర్యాదు తీసుకోలేదు. నెల క్రితం ఆర్పీజీటీ రోడ్డులో మడకశిర ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి తన ద్విచక్రవాహనాన్ని పార్క్‌చేసి, ఆస్పత్రిలోకి వెళ్లాడు. బయటకు వచ్చి చూసేసరికి వాహనం కనబడలేదు. ఆరాతీసి బండి ఎత్తుకెళ్లారని నిర్ధారించుకుని పోలీసుల వద్దకు వెళ్తే రికార్డులు తీసుకు రమ్మన్నారు. మరుసటి రోజు రికార్డులు తీసుకెళ్లినా వాటిలో వేరే పేరుందని చెప్పి ఫిర్యాదు తీసుకోలేదు. బెంగళూరు రోడ్డులో ఓ ఉద్యోగి బ్యాంకు వద్ద వాహనాన్ని పార్క్‌చేసి లోపలికి వెళ్లాడు. బయటకు వచ్చి చూసేసరికి బండి చోరీ అయింది. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తే.. తీసుకున్నారు తప్ప.. ఇప్పటి వరకు రికవరీ చేయలేదు. ఇవి మచ్చుకు కొన్ని మాత్రమే. ఇలాంటివి హిందూపురం పట్టణంలో కోకొల్లలు. నాలుగు రోజుల క్రితం హిందూపురం మండలం కొటిపిలో పట్టపగలే ఓ యువకుడు ద్విచక్రవాహనాన్ని ఎత్తుకెళ్తుండగా.. వెంబడించి, పట్టుకున్నారు. వాహనాన్ని లాక్కున్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తే తాము బందోబస్తులో ఉన్నామనీ, పట్టుబడిన యువకుడిని స్టేషన్‌లో అప్పగించాలని ఉచిత సలహా ఇచ్చారు. సదరు యువకుడిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో వారికే ఎరుక. పట్టణానికి నిత్యం వివిధ పనుల నిమిత్తం వేలాది మంది ద్విచక్రవాహనాల్లో వస్తుంటారు. హిందూపురంలో వాహనాలు దుకాణం ముందు పార్క్ చేయడానికి స్థలం ఉండదు. దూరంగా పార్క్‌చేసి వచ్చి చూస్తే వాహనం మాయం అవుతుంది. ఇటీవల హిందూపురం పట్టణం, పల్లెల్లో సైతం ద్విచక్రవాహన దొంగలు అధికమయ్యారు. పోలీసులు మిన్నకుండిపోతుండడంతో వాహన చోదకులకు మార్గం సుగమం అవుతోంది. యువత గంజాయి, మద్యానికి బానిసై వాహనాలు ఎత్తుకెళ్లి తాకట్టుపెట్టి వ్యసనాలు తీర్చుకుంటున్నట్లు తెలుస్తోంది. ప్రతినెలా హిందూపురంలో పది నుంచి 15 వాహనాలు చోరీ అవుతున్నాయంటే పోలీసుల పనితీరు ఎలా ఉందో అర్థం చేసేకోవచ్చు.

కనిపించని పోలీసు మార్క్..

ఒకప్పుడు ద్విచక్రవాహనం చోరీ అయిందంటే జిల్లాస్థాయి పోలీసులు సైతం అలర్ట్ అయ్యేవారు. ఇటీవల నిత్యం వాహనాలు చోరీ అవుతున్నా పోలీసులు మాత్రం పెద్దగా పట్టించుకోలేదన్న విమర్శలున్నాయి. దీంతో దొంగలు రెచ్చిపోతున్నట్లు బాధిత వాహన యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని వాహనాలకు సంబంధించి ఫిర్యాదు తీసుకున్నా రికవరీ చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. పక్కనున్న కర్ణాటకలో వాహన దొంగలు అక్కడి పోలీసులకు పట్టుబడితే వారిద్వారా రికవరీ ప్రయత్నాలు సాగిస్తున్నారు తప్ప.. ఇక్కడి పోలీసులు పెద్దగా దృష్టి సారించలేదన్న అపవాదు మూటగట్టుకున్నారు.

నిఘా ఎక్కడ?

బైక్‌లు మాయమైనా, వాహనాలపై నిందితులు తప్పించుకునేందుకు ప్రయత్నించినా వాటి నంబర్లు సులువుగా గుర్తించేలా కెమెరాలు తప్పనిసరి. హిందూపురంలో నంబరు ప్లేటు గుర్తించే కెమెరాలు కొన్నిచోట్ల ఉన్నా అవి మసకబారినట్లు తెలుస్తోంది. దీంతో ద్విచక్రవాహనం చోరీ అయితే సమీప దుకాణాల వద్ద ఉన్న సీసీ కెమెరాల సీసీ టీవీ ఫుటేజీపై ఆరాతీస్తున్నారు. అంతే తప్ప.. పోలీసులు పూర్తిస్థాయిలో నిఘా ఉంచలేదన్నది వాహనదారుల అభిప్రాయం.

ఉష్ణోగ్రతలు (ఆది)

	గరిష్ఠం	కనిష్ఠం
పుట్టపర్తి	40.0	23.0
కదిరి	37.0	23.0
ధర్మవరం	39.0	24.0
హిందూపురం	37.0	23.0
పెనుకొండ	38.0	23.0

అమ్మవార్ల అలక తీర్చిన శ్రీవారు

ఆకట్టుకున్న శ్రీవారు, దేవేరుల సంవాదం

అశ్వవాహనంపై భక్తులకు దర్శనమిచ్చిన ఖాద్రీశుడు



అలకోత్సవంలో దేవేరుల సమేత నారసింహుడు

కదిరి, మార్చి 31: శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగమైన అలకోత్సవ ఆదివారం రాత్రి కనులపండువగా సాగింది. ఆనవాయితీ ప్రకారం ఈ ఉత్సవాన్ని ఆలయ ఈఓ శ్రీనివాస రెడ్డి నివాసం వద్ద నిర్వహించారు. కల్యాణోత్సవం నాటి నుంచి స్వామివారు రోజుకో వాహనంపై ఊరేగుతూ భక్తులను తప్ప.. తమను పట్టించుకోవడం లేదంటూ శ్రీదేవి, భూదేవి అమ్మవార్లు అలక పాన్పు ఎక్కడం, వారిని శ్రీవారు అనుయించయించే ఘట్టాలే అలుకోత్సవం. అమ్మవార్ల తరపున ఈఓ వకాల్తా పుచ్చుకోగా.. శ్రీవారు, అమ్మవార్ల మధ్య సంభాషణను ఆలయ అర్చకులు భక్తులకు వినిపించడం ఉత్సవం ప్రత్యేకత. సృష్టిలో సర్వమూ తానేననీ, లోక కల్యాణార్థమే తాను భక్తుల చెంతకు వెళ్తున్నానంటూ శ్రీవారు నచ్చజెప్పడంతో అమ్మవార్లు శాంతించి, యాగశాల ప్రవేశం గావించారు. ఈ ఉత్సవానికి ఆలయ ఈఓ దంపతులు ఉభయదారులుగా వ్యవహరించి, శ్రీవారు, అమ్మవార్లకు పట్టు వస్త్రాలను సమర్పించారు. పట్టణంలోని ప్రముఖులతో పాటు పెద్దఎత్తున భక్తులు ఈ ఉత్సవాన్ని వీక్షించారు. అలుకోత్సవం అనంతరం శ్రీవారు అశ్వవాహనంపై కొలువుదీరి మాడవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. పదిహేను రోజుల పాటు నిర్వహించిన బ్రహ్మోత్సవాలు విజయవంతం అయ్యాయని చాటి చెప్పేందుకే శ్వేత అశ్వవాహనంపై స్వామివారు దర్శనమిచ్చారు.

నేడు తీర్థవాది

శ్రీ ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం తీర్థవాది నిర్వహించనున్నారు. ఉత్సవాలకు అంకురార్పణ చేసిన నాటి నుంచి యాగశాలలోనే కొలువుదీరిన శ్రీవారు సోమవారం ఆలయ ప్రవేశం చేయనున్నారు. నేటి ఉత్సవంలో భాగంగా ఉదయం నిత్యపూజ అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారు ఆలయప్రాంగణంలో కొలువుదీరుతారు. ఈ సందర్భంగా అధికారులు, ఉద్యోగులు, భక్తులు అన్న భేదం లేకుండా అందరూ రంగులు చల్లుకుని, వసంతోత్సవాలు చేసుకుంటారు. అనంతరం దేవేరుల సమేత శ్రీవారిని ఆలయానికి పడమర దిక్కున ఉన్న భృగుతీర్థం వరకు ఊరేగిస్తారు.వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ భృగుతీర్థంలో శ్రీచక్రస్నానం, అభిషేకాలు నిర్వహించిన అనంతరం తిరువీధుల గుండా ఆలయ ప్రవేశం గావిస్తారు. నారసింహుడిని ఇలవేల్పుగా కొలిచే భక్తులు తీర్థవాది రోజు శ్రీవారికి కానుకలు సమర్పించడం ఆనవాయితీ. ఇందుకోసమే వేలాదిమంది భక్తులు ఇక్కడికి తరలివస్తారు. శ్రీచక్రస్నానం అనంతరం శ్రీవారు ఆలయంలోకి ప్రవేశించిన వెంటనే ప్రధాన ద్వారాలు మూసివేసి, అన్నిరకాల దర్శనాలను రద్దు చేస్తారు. పున: దర్శనం మంగళవారం ఉదయమే.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సెహరీ
పుట్టపర్తి	6.35 సోమవారం (సాయంత్రం)	4.53 మంగళవారం (ఉదయం)
కదిరి	6.32 సోమవారం (సాయంత్రం)	5.00 మంగళవారం (ఉదయం)
ధర్మవరం	6.37 సోమవారం (సాయంత్రం)	4.57 మంగళవారం (ఉదయం)
హిందూపురం	6.35 సోమవారం (సాయంత్రం)	5.01 మంగళవారం (ఉదయం)
పెనుకొండ	6.33 సోమవారం (సాయంత్రం)	4.58 మంగళవారం (ఉదయం)

నేటి నుంచి పది మూల్యాంకనం

కొత్తచెరువు, మార్చి 31: స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం నుంచి పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం నిర్వహించనున్నట్లు డీఈఓ మీనాక్షి ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి 4 గంటల వరకు మూల్యాంకనం కొనసాగుతుందన్నారు. ఇందుకుగాను 1400 మందిని నియమించామన్నారు. జిల్లాకు రెగ్యులర్ 1.72 లక్షలు, ఓపెన్ స్కూల్‌కు చెందిన 15 వేల జవాబు పత్రాలు వచ్చాయని డీఈఓ వివరించారు.

సీఎం విడిది కేంద్రంలో ఈస్టర్ వేడుకలు


- పాల్గొన్న జగన్ భార్య భారతి
- రెండు కిలోమీటర్ల మేర రహదారి బంద్
- ఇబ్బందులు పడిన వాహనదారులు, రైతులు

బత్తలపల్లి, మార్చి 31: మండలంలోని ముష్టూరు-రాఘవంపల్లి క్రాస్ మధ్య అనంతపురం-చెన్నై జాతీయ రహదారి పక్కన ఏర్పాటు చేసిన సీఎం జగన్ విడిది కేంద్రంలో ఆదివారం ఈస్టర్ వేడుకలు నిర్వహించారు. జగన్ చేపట్టిన బస్సుయాత్ర శనివారం అర్ధరాత్రికి ముష్టూరు-రాఘవంపల్లి క్రాస్ మధ్య ఏర్పాటు చేసిన విడిది కేంద్రానికి చేరుకుంది. ఆదివారం ఈ విడిది కేంద్రంలో సీఎం జగన్‌తోపాటు ఆయన సతీమణి భారతి ఈస్టర్ వేడుకలను ఘనంగా చేసుకున్నారు. విడిది కేంద్రం వద్ద పోలీసులను భారీగా మోహరించారు.

జాతీయ రహదారి బంద్

అనంతపురం-చెన్నై జాతీయ రహదారి నిత్యం రద్దీగా ఉంటుంది. రహదారి పక్కన ముష్టూరు-రాఘవంపల్లి మధ్య సీఎం జగన్ విడిది కేంద్రం ఏర్పాటుచేశారు. దీంతో పోలీసులు ముష్టూరు క్రాస్ నుంచి రాఘవంపల్లి క్రాస్ వరకు దాదాపు రెండు కిలోమీటర్ల మేర జాతీయ రహదారిని బంద్ చేశారు. భారీఎత్తున బారికేడ్లు ఏర్పాటు చేశారు. దీంతో రహదారిపై వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వన్‌వేలో వెళ్లాల్సి రావడంతో ఎక్కడ ప్రమాదాలు జరుగుతాయోనని భయాందోళనలు చెందారు. రెండు కిలోమీటర్ల మేర వ్యవసాయ పొలాల వద్దకు వెళ్లే రైతులను కూడా పోలీసులు అడ్డుకున్నారు. పొలాల వద్దకు వెళ్లనీయలేదు. తమ పొలాల వద్దకు వెళ్లకుండా అడ్డుకునే హక్కు పోలీసులు ఎవరిచ్చారని రైతులు మండిపడ్డారు. చేసేదిలేక వారు చుట్టుపక్కల గ్రామాలను చుట్టేసుకుని, తమ పొలాలకు వెళ్లాల్సి వచ్చింది.





సీఎం జగన్ విడిది కేంద్రం.. ఎండ వేడిమి భరించలేక చెట్లకింద సేదతీరుతున్న పోలీసులు



అనంతపురం-చెన్నై జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన బారికేడ్లు

దాహం.. దాహం

గ్రామాల్లో తాగునీటి కష్టాలు

- అడుగంటిన భూగర్భ జలాలు
- నీటి సమస్య పట్టించుకోని పాలకులు
- పొలాల వైపు గ్రామీణుల పరుగులు
- కొన్ని ప్రాంతాల్లో ఉప్పునీరే గతి

ఉమ్మడి జిల్లాలోని గ్రామీణ ప్రజలు తాగునీటి కోసం అల్లాడిపోతున్నారు. తీవ్ర వర్షాభావంతో మండు వేసవిలో బోరుబావులు ఎండిపోతున్నాయి. కొన్నింటిలో అరకొరగానే నీరు వస్తున్నాయి. పాలకులు, అధికారులు దాహార్తి తీర్చలేకపోవడంతో ప్రజలు తాగునీటి కోసం వ్యవసాయ పొలాల వైపు పరుగులు పెడుతున్నారు. గత ఏడాది మోస్తరు వర్షాలు కూడా కురవకపోవడంతో పలు ప్రాంతాల్లో భుగర్భ జలాలు అడుగంటాయి. కొన్ని ప్రాంతాల్లో 500, వెయ్యి అడుగులు బోరుబావులు తవ్వినా చుక్కనీరు లభించడం లేదు. దీంతో ఆ ప్రాంతాల ప్రజలు గ్రామ సమీపంలోని పొలాల వద్దకు వెళ్లి సైకిళ్లు, స్కూటర్లు, ఎద్దులబండ్ల మీద నీటిని తెచ్చుకుంటున్నారు. అధికారులు ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్న అరకొర నీరు సరిపోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గుంతకల్లుటౌన్, మార్చి 31: వేసవిలో ఎండలు ముదిరే కొద్దీ గ్రామాల్లో నీటి ఎద్దడి తీవ్రమవుతోంది. మండలంలోని మొలకల పెంట, ఎన్ వెంకటాంపల్లి, గుర్రబ్బాడు గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తీవ్రంగా నెలకొంది. మొలకల పెంట గ్రామంలో గత ఏడాది ఆగస్టు నుంచి తాగు నీటి ఎద్దడి నెలకొంది. గుంతకల్లు రోడ్డులో, అమీన్ పల్లి రోడ్డులో చేతిపంపు నుంచి నీటిని తెచ్చుకుంటున్నారు. అలాగే వెంకటాంపల్లి గ్రామంలో భూగర్భజలాలు అడుగంటడంతో నీటి కష్టాలను గ్రామస్థులు ఎదుర్కొంటున్నారు. ప్రధాన ట్యాంక్‌కు పైప్ లైన్ ద్వారా నీరు ఎక్కకపోవడంతో మధ్యలో లీకేజీ పైపుల ద్వారా వస్తున్న నీటిని ప్రజలు పట్టుకుంటున్నారు. జల్‌జీవన్ మిషన్ పథకం కింద నాలుగు బోర్లు వేసినా నీరు పడలేదు. రోజుకు రెండు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. అలాగే గుర్రబ్బాడు గ్రామంలో ఇదే పరిస్థితి. రోజు రెండు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. గుంతకల్లులోని సీఐటీయూ, రామిరెడ్డి, దోనిముక్కల రోడ్డు, హంపయ్య, మోదీనాబాద్, సాయినాథ్‌గౌడ్ కాలనీ, సిద్ధార్థనగర్‌లో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉంది. కొన్ని కాలనీలకు పైప్‌లైన్ లేకపోవడంతో మున్సిపల్ ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. 3 నుంచి 6 రోజులకొకసారి ట్యాంకర్లు రావడంతో ప్రజలు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు.



వెంకటాంపల్లి గ్రామంలో లీకేజీ పైప్ వద్ద నీటిని పట్టుకుంటున్న మహిళలు



నింబగల్లు వద్ద ఎండిపోయిన తాగునీటి చెరువు



గుంతకల్లులో సిద్ధార్థ నగర్‌లో పని చేయని స్పాట్ డెలివరీ ట్యాంకు



గుత్తిలో వంతుల కోసం చెట్టుకు వేలాడదీసిన బిందెలు

పదిహేను రోజులకు ఒక్కసారి

ఉరవకొండ: పట్టణంలో పదిహేను రోజులకు ఒకసారి తాగునీరు సరఫరా చేస్తుండటంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. నింబగల్లు సమ్మర్ స్టోరేజీ ట్యాంకు నుంచి ఉరవకొండతో పాటు ఏడు గ్రామాలకు నీటి సరఫరా చేయాల్సి ఉంది. అక్కడ మూడు సమ్మర్ స్టోరేజీ ట్యాంకు ఉన్నాయి. మూడో ట్యాంకు ఇప్పటికే ఎండిపోయింది. పెద్ద ట్యాంకులో 15 అడుగులకుగాను ప్రస్తుతం 4 అడుగుల మేర నీరు నిల్వ ఉంది. బండల ట్యాంకులో 6 మీటర్లకు గాను 2 మీటర్లు ఉంది. ప్రస్తుతం ఉన్న నీటి నిల్వలు మరో నెలరోజులు రావడం కూడా గగనమే. మండలంలోని రాయంపల్లి, నెరమెట్ల, బూదగవి, నింబగల్లు వెలికొండ గ్రామాల్లో కూడా తాగునీటి సమస్య నెలకొని ఉంది. కూడేరు మండలం కడదరకుంటలో ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తున్నారు. నియోజకవర్గంలోని కాలువపల్లి, తట్రగల్లు గ్రామాల్లో బోర్లు ఎండిపోవడంతో ఐదురోజులకు ఒక్కసారి నీటిని వదులుతున్నారు. 19 గ్రామాలకు నీటిని సరఫరా చేసే కొనకొండ్ల సమ్మర్‌స్టోరేజీ ట్యాంక్‌లో నీటి నిల్వలు అడుగంటుతున్నాయి. విడపనకల్లు మండలంలోని డొనేకల్లు, హావళిగి పాల్తూరు గ్రామాల్లో నీటి సమస్య నెలకొంది.

వంతు కోసం చెట్టుకు బిందెలు

గుత్తి: గుత్తి పట్టణంలో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొంది. పట్టణంలో తాగునీటి కోసం నానా అవస్థలు పడుతున్నారు. పలు కాలనీల్లో స్పాట్ డెలివరీ ట్యాంకులు కూడా పనిచేయక వృథాగా పడి ఉన్నాయి. ప్రభుత్వం గుత్తికి నీటిని అందించడంలో ఘోరంగా విఫలమైంది. కోట వీధిలో వంతుల కోసం చెట్టుకు బిందెలు వేలాడదీసి క్యూలో పట్టుకుంటున్న పరిస్థితి ఉంది. గుత్తి గుత్తి ఆర్ఎస్‌లలో నీటి ఎద్దడి భయంకరంగా ఉంది.



వెయ్యి అడుగులు తవ్వినా దొరకని నీరు

మడకశిర: తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో మడకశిర ప్రాంతంలో వెయ్యి అడుగుల లోతు తవ్వినా చుక్కనీరు దొరకని పరిస్థితి నెలకొంది. రొళ్ల, అగళి మండలాల్లో 1000 అడుగులు తవ్విన చుక్క నీరు దొరకడం లేదు. దీంతో పలుచోట్ల ట్యాకర్ల ద్వారా తాగు నీటిని అందిస్తున్నారు. అగళి మండలంలో గాయిత్రికాలనీ, తండా, ముత్తేపల్లి, గుడిబండ మండలంలో సింగేపల్లి, జంబులబండ, కల్లురొప్పం, ఎస్ఎస్ గుండ్లు, మడకశిర పట్టణంలో 12,17, 4వ వార్డులలో తాగునీటి సమస్య నెలకొంది.



గాయిత్రి కాలనీలో ట్యాంకర్ వద్ద నీటిని పట్టుకుంటున్న మహిళలు

మూడు నెలలుగా కటకట

గుత్తి రూరల్: మండలంలోని ఊటకల్లు, ఊబిచెర్ల గ్రామాలలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. ఊటకల్లులో మూడు బోర్లు ఉన్నాయి. ఒకబోరు పూర్తిగా ఎండిపోగా, మిగిలిన రెండింటిలో అరకొరగా నీరు వస్తోంది. దీంతో స్థానికులు మూడు నెలల నుంచి తాగునీటి కోసం కటకటలాడుతున్నారు. గ్రామ శివారులోని ట్యాంకు నుంచి బైక్‌లపై నీటిని తీసుకెళ్తున్నారు. కే ఊబిచెర్ల లోని బీసీ కాలనీలో పైపులైన్ లేని కారణంగా తాగునీటి సమస్య నెలకొంది.



అనంతపురంరూరల్ : మండలంలోని పాపంపేట, అక్కంపల్లి, కురుగుంట, నారాయణపురం, చిన్నంపల్లి, కక్కలపల్లి కాలనీ, కామారుపల్లి తదితర ప్రాంతాల్లో తాగునీటి కోసం ప్రజలు అల్లాడుతున్నారు. ఆయా ప్రాంతాల్లో 80వేల మంది ప్రజలు నివాసముంటున్నారు. ఆయా ప్రాంతాలకు పీఏబీఆర్ నుంచి సత్యసాయి నీటి పథకం ద్వారా నీటి సరఫరా జరుగుతుంది. ఆయా ప్రాంతాల పరిధిలోని సంపులకు నీటి సరఫరా చేసి, ఓవర్ హెడ్ ట్యాంకులను నింపి వాటి ద్వారా ప్రజలకు సరఫరా చేయాల్సి ఉంది. అయితే పీఏబీఆర్ వద్ద నీటి పంపిణీ మోటర్లు మరమ్మతులకు గురైనట్లు తెలుస్తోంది. ఈక్రమంలో ఒక మోటార్‌తోనే నీటిని పంపిణీ చేస్తున్నారు. ఈక్రమంలో గ్రామాలకు నీటి సరఫరా అంతంత మాత్రంగానే జరుగుతోంది.

సత్యసాయి నీటి సరఫరా అంతంతమాత్రమే

ఉప్పునీటితో సరిపెట్టుకుంటున్న ప్రజలు..

సత్యసాయి నీటి సరఫరా సక్రమంగా లేకపోవడంతో గ్రామీణులు నానా అవస్థలు పడుతున్నారు. తాగునీటి అవసరాలకు ఆటోలతో సరఫరా అయ్యే నీటిని బిందె రూ.10తో కొనుగోలు చేస్తున్నారు.

నీటి ఎద్దటి నేపథ్యంలో పంచాయతీలో స్థానికంగా బోర్ల ద్వారా ఉప్పునీటిని సరఫరా చేస్తున్నారు. వాటితోనే ప్రజలు తమ అవసరాలను తీర్చుకుంటున్నారు. ఈ నీరు కూడా పాపంపేట పరిధిలో ఒక్కొక్క ప్రాంతానికి నాలుగైదు రోజుల కోసారి సరఫరా అవుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు.

నెలకోసారి వస్తున్న సత్యసాయి నీరు..

తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. సత్యసాయి నీరు వస్తే బాగుంటుంది. అవి నెల, రెండు నెలలకోసారి వస్తున్నాయి. దీంతో వీధిలోకి వచ్చే ట్యాంకర్లతో బిందె రూ.10తో కొనుగోలు చేస్తున్నాం. ఉప్పునీళ్లు కూడా రెండు మూడు రోజులకోసారి వస్తున్నాయి. **- శైలాజ, పాపంపేట**



కక్కలపల్లి కాలనీలోని సత్యసాయి నీటి సరఫరా సంపు

ఉప్పునీటితోనే సరిపెట్టుకుంటున్నాం



స్థానికంగా ఏడేళ్లుగా నివాసముంటున్నాం. గతంలో నీటి కోసం ఇంత ఇబ్బందులు పడలేదు. సత్యసాయి నీరు మూడు నెలలకోసారి వస్తున్నాయి. ఉప్పునీరు అంతంత మాత్రంగానే వస్తున్నాయి. దీంతో ఇంట్లో ఉన్న బోరులో వచ్చే ఉప్పు నీటితోనే సరిపెట్టుకుంటున్నాం. ఉప్పునీటి కారణంగా ఫ్యూరిఫైడ్ పరికరాలు దెబ్బతినడంతో వాటిని మూలపడేశాం. ఆటోవారితో కొనుగోలు చేసి తాగునీటి సమస్యను తీర్చుకుంటున్నాం. **- పుష్పావతి, బాలాజీ విలాస్**

సీఎంపై చెప్పు విసిరిన ఘటనపై కేసు

అనంతపురం క్రైం, మార్చి 31: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిపై చెప్పు విసిరిన ఘటనపై గుత్తి పోలీసులు కేసు నమోదు చేశారు. బస్సు యాత్రలో భాగంగా శనివారం జిల్లాలో సీఎం జగన్ పర్యటించారు. గుత్తి పట్టణంలో బస్సుపై అభివాదం చేస్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తి చెప్పు విసరడం తెలిసిందే. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేయగా, ఆ వ్యక్తిని పట్టుకునేందుకు పలు పోలీస్ బృందాలు రంగంలోకి దిగాయి. సీసీ ఫుటేజీ, టెక్నికల్ ఎవిడెన్స్ ఆధారంగా చెప్పు విసిరిన వ్యక్తిని పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది.

నవోదయ ఫలితాలు విడుదల

లేపాక్షి, మార్చి 31 : నవోదయ విద్యాలయంలో ఆరో తరగతి ప్రవేశానికి జనవరి 20న జరిగిన పరీక్షల ఫలితాలు ఆదివారం విడుదలైనట్లు ప్రిన్సిపాల్ నాగరాజు తెలిపారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో మొత్తం 8,857మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 4,871మంది హాజరై పరీక్ష రాశారని తెలిపారు. స్థానిక జవహర్ నవోదయ విద్యాలయంలో 79సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. పరీక్షలో ఉత్తీర్ణులైన వారితో భరీచేస్తామన్నారు. పూర్తి వివరాలకు లేపాక్షి నవోదయ విద్యాలయంలో సంప్రదించాలన్నారు.

ముగ్గురు వలంటీర్లు, ఇద్దరు కాంట్రాక్ట్ సిబ్బంది తొలగింపు

అనంతపురం టౌన్, మార్చి 31: జిల్లాలో ప్రభుత్వంనుంచి గౌరవ వేతనాలు పొందుతూ ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా రాజకీయ ప్రచారాల్లో పాల్గొన్న మరో ఐదుగురిపై కలెక్టరు వేటు వేశారు. ఉరవకొండ నియోజకవర్గం విడపనకల్లు మండలం హావళిగికి చెందిన వలంటీర్ కొల్లారప్పతోపాటు రాప్తాడు నియోజకవర్గం అనంతపురంరూరల్ మండలం కందుకూరుకు చెందిన వలంటీర్లు ప్రతీక్, గణేష్‌లు కోడ్ నిబంధనలను వ్యతిరేకిస్తూ వైసీపీ ప్రచారంలో పాల్గొన్నందుకు విధులనుంచి తొలగించినట్టు కలెక్టరు గౌతమి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే విడపనకల్లు మండలం హావళిగికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ మల్లికార్జున, తాడిపత్రి ఆటోనగర్‌కు చెందిన షిఫ్ట్ ఆపరేటర్ పావురాల క్రిష్టయ్యను సస్పెండ్ చేశారు. సీ విజిల్ యాప్‌కు ఆదివారం 15 ఫిర్యాదులు రాగా వాటిని పరిశీలించి పరిష్కరిస్తామని కలెక్టరు గౌతమి తెలిపారు.

ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం

- జిల్లా వ్యాప్తంగా 2,236 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు
- జేఎన్‌టీయూలో నియోజకవర్గాల వారీగా కౌంటింగ్

అనంతపురం టౌన్, మార్చి 31: సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు జిల్లా యంత్రాంగం సిద్ధమైంది. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాలో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎన్నికల నిర్వహణలో అత్యంత కీలకమైన పోలింగ్‌బూత్‌లు, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాట్లు పూర్తి చేశారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఈప్రక్రియను చేపట్టారు. కలెక్టరు ఇచ్చిన సమాచారం మేరకు జిల్లావ్యాప్తంగా 2,236 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందులో కూడా 1500 ఓటర్లు ఉన్నచోట ఇబ్బందులు కలగకుండా కమిషన్ సూచనల ప్రకారం అక్కడ సహాయ పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. 2,213 సాధారణ పోలింగ్ స్టేషన్లు ఉండగా 23 సహాయ కేంద్రాలు ఉన్నాయి. కౌంటింగ్ కేంద్రాలను జిల్లాకేంద్రంలోని జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేశారు. ఇక్కడ కూడా నియోజకవర్గాల వారీగా ఒక్కో నియోజకవర్గానికి సంబంధించిన ఓట్లు లెక్కించనున్నారు.

● నియోజకవర్గాల వారీగా పోలింగ్ కేంద్రాలు ఇలా...

నియోజకవర్గం	ఓటర్లు	పోలింగ్ కేంద్రాలు	సహాయక కేంద్రాలు	మొత్తం
రాయదుర్గం	2,62,520	296	00	296
ఉరవకొండ	2,22,752	259	04	263
గుంతకల్లు	2,68,194	276	00	276
తాడిపత్రి	2,46,573	272	02	274
శింగనమల	2,45,300	293	00	293
కళ్యాణదుర్గం	2,78,466	261	00	261
అనంతపురం	2,78,475	277	15	292
రాప్తాడు	2,48,313	279	02	281

● జేఎన్‌టీయూలో కౌంటింగ్ కేంద్రాలు ఇలా...

నియోజకవర్గం	కౌంటింగ్ ప్రాంతం
రాయదుర్గం	జేఎన్‌టీయూ ప్రధానభవనం, 1వఅంతస్తు(నార్త్‌వింగ్)
గుంతకల్లు	జేఎన్‌టీయూ ప్రధానభవనం, 1వఅంతస్తు (సౌత్‌వింగ్)
తాడిపత్రి	జేఎన్‌టీయూ ప్రధానభవనం, గ్రౌండ్‌ఫ్లోర్, (సౌత్‌వింగ్)
ఉరవకొండ	జేఎన్‌టీయూ అడ్మినిస్ట్రేషన్ బ్లాక్, (గ్రౌండ్‌ఫ్లోర్)
శింగనమల	జేఎన్‌టీయూ అడ్మినిస్ట్రేషన్ బ్లాక్, (1వ అంతస్తు)
కళ్యాణదుర్గం	జేఎన్‌టీయూ అడ్మినిస్ట్రేషన్ బ్లాక్, (1వ అంతస్తు)
అనంతపురం అర్బన్	జేఎన్‌టీయూ ఈసీఈ బ్లాక్, (1వ అంతస్తు)
రాప్తాడు	జేఎన్‌టీయూ ఈసీఈ బ్లాక్, (1వ అంతస్తు)

బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య



చింతా రాజేశ్వరి (ఫైల్)

ధర్మవరం, మార్చి 31: పట్టణంలోని కేతిరెడ్డికాలనీలో ఓ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. ఘటనపై టూటౌన్ పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. కేతిరెడ్డికాలనీకి చెందిన చింతా చిదంబరం, శారద దంపతుల కుమార్తె చింతా రాజేశ్వరి(21) పుట్టపర్తిలోని సంస్కృతి కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతోంది. అయితే ఈమె తరచూ కడుపునొప్పితో బాధపడుతుండేది. తల్లిదండ్రులు పలుచోట్ల చికిత్స చేయించారు. అయినా నయం కాలేదు. ఈ క్రమంలో ఆదివారం తెల్లవారుజామున నొప్పి తీవ్రం కావడంతో మనస్థాపం చెందిన విద్యార్థిని ఇంటిలోనే ఓ గదిలోకి వెళ్లి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఎంతసేపటికీ బయటకు రాకపోవడంతో తల్లి కిటికిలో ంచి చూడగా.. రాజేశ్వరి ఉరికి వేలాడుతూ కనిపించింది. తల్లి పెద్దగా కేకలు వేయడంతో కుటుంబసభ్యులు వచ్చి తలుపులు బద్దలు కొట్టి ఆమెను కిందకు దించి చూశారు. అప్పటికే మృతి చెందింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి మృతదేహాన్ని పరిశీలించారు. ఆత్మహత్యకు గల కారణాలను తల్లిదండ్రులను అడిగి తెలుసుకుని కేసు నమోదు చేసుకున్నారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ద్విచక్రవాహనాలు ఢీ

- వలంటీర్ మృతి.. రిటైర్డ్ టీచర్ పరిస్థితి విషమం

గోరంట్ల, మార్చి 31: మండలంలోని పుట్టపర్తి ప్రధాన రహదారిలో నిషా డిజైన్స్ గార్మెంట్స్ పరిశ్రమ వద్ద రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని, గ్రామ వలంటీర్ వినోద్ కుమార్(28) మృతిచెందగా, రిటైర్డ్ ఉపాధ్యాయుడు నాగప్పకు తీవ్రగాయాలయ్యాయి. మండలంలోని గుమ్మయ్యగారిపల్లి విలాస్ లో నివాసముంటున్న రిటైర్డ్ ఉపాధ్యాయుడు నాగప్ప కొత్త చెరువుకు వెళ్లి ఆదివారం రాత్రి తిరిగి వస్తున్నాడు. అలాగే మండలంలోని పుట్టగుండ్లపల్లికి చెందిన వలంటీర్ వినోద్ స్వగ్రామానికి వెళ్తున్నాడు.

ఈ రెండు ద్విచక్ర వాహనాలు గార్మెంట్స్ పరిశ్రమ వద్ద ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో రెం డు ద్విచక్రవాహనాలు రోడ్డుకు కుడివైపున పడిపోగా, ఇరువురు చేరోవైపున తీవ్రగాయాలతో పడ్డారు. సమీపంలోని గుంతపల్లి గ్రామస్థులు గమనించి 108 వాహనం ద్వారా గోరంట్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే వినోద్ మరణించినట్లు వైద్యులు తెలిపారు. నాగప్ప చెవి, ముక్కు నుంచి తీవ్ర రక్తస్రావంతో అపస్మాకర స్థితిలో ఉండగా మెరుగైనవైద్యం కోసం బెంగళూరుకు తరలించారు. ఈ సంఘటనపై కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడు వినోద్‌కు నాలుగు నెలల కిందటే వివాహమైంది.

అలరించిన సంగీత కచేరి

పుట్టపర్తి, మార్చి 31: అనంతపురానికి చెందిన సత్యసాయి మహిళా కళాశాల విద్యార్థినులు సంగీత గాన కచేరి చేపట్టి భక్తులను అలరించారు. పట్టణంలోని ప్రశాంతి నిలయంలో గల సాయి కుల్వంత్ హాల్లో ఆదివారం సాయంత్రం డిగ్రీ, పీజీ విద్యార్థినులు విద్యాసంవత్సరం ముగింపు సందర్భంగా.. ప్రేమకు ప్రేమతో పేరిట వాయిద్య సంగీత గాన కచేరిని నిర్వహించారు. తబలా, బ్యాండ్ మేళం వాయిస్తూ భక్తి గీతాలు ఆలపించారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.



పాటలు పాడుతున్న విద్యార్థినులు

టీడీపీతోనే ముస్లింలకు న్యాయం

- మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి
- ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు


ఇఫ్తార్ విందులో మాట్లాడుతున్న మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి

పుట్టపర్తి రూరల్ మార్చి 31: టీడీపీతోనే ముస్లింమైనార్టీలకు న్యాయం జరుగుతుందని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని అబ్దుల్‌గార్డెన్‌లో ఆదివారం ఆయన ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ సందర్భంగా వారితో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. తెలుగుదేశంతోనే ముస్లిం మైనారిటీలకు న్యాయం జరుగుతుందన్నారు. గతంలో అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబు ముస్లింల సంక్షేమానికి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేశారని గుర్తుచేశారు. ముఖ్యంగా ముస్లిం మైనార్టీల సంక్షేమం కోసం 13వందల కోట్లరూపాయలు ఖర్చుచేయడం జరగిందన్నారు. మసీద్, ఈద్గా మరమ్మత్తుల కోసం జిల్లాకు 2.5 కోట్ల చొప్పున నిధులు ఖర్చుచేసినట్లు పేర్కొన్నారు. మసీదుల్లో పనిచేసే ఇమాంలకు ఒక్కొక్కరికి రూ. 5వేలు, మౌజన్‌లకు రూ. 4వేలు చొప్పున గౌరవవేతనం అందించారన్నారు. తాను మైనార్టీశాఖమంత్రిగా ఉన్నప్పుడు రాష్ట్రంలో సుమారు 14,590 ఎకరాల వక్ఫ్‌భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడామని గుర్తు చేశారు. రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశంపార్టీ గెలవాల్సిన చారిత్రక అవసరాన్ని తెలియచేశారు. పల్లె సింధూరరెడ్డిని అఖండ మెజారిటీతో గెలిపించాలని ఆయన ముస్లిం మైనారిటీలను కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ముస్లింలు కోరినట్లు శ్మశాన వాటిక కోసం 5 ఎకరాలు భూమిని కేటాయిస్తామని హామీ ఇచ్చారు. అంతకు మునుపు పల్లె ముస్లింలతో కలిసి ప్రార్థనలు చేశారు. తర్వాత అందరూ విందులో పాల్గొన్నారు. కార్యక్రమంలో మైనారిటీ నాయకులు మహమ్మద్‌రఫీ, అబ్దుల్, బాబావలి, యాసీన్, మాణిక్యం బాబా, షఫీ, షాదిక్‌వలి, జాకీర్, షాన్వజ్, ఇర్షాద్, ఆరిఫ్‌ఖాన్, మహబూబ్‌బాషాతో పాటు టీడీపీ పట్టణ, రూరల్ కన్వీనర్లు రామాంజనేయులు, విజయ్‌కుమార్, నాయకులు బెస్తచలపతి, కడియాలరాము, తిరుపాల్, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

మైనార్టీల ద్రోహి జగన్..

ఓబుళదేవరచెరువు: మైనార్టీలకు సీఎం జగన్ తీరని ద్రోహం చేశారని మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి విమర్శించారు. మండలకేంద్రంలోని వెంకటసాయి ఐటీఐలో ఆయన ముస్లిం మైనార్టీలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముస్లిం మైనార్టీలకు సీఎం జగన్ తీరని ద్రోహం చేశారన్నారు. ముఖ్యంగా అనేక సంక్షేమ పథకాలను రద్దు చేశారన్నారు. టీడీపీ పాలనలో హజ్ యాత్రకు వెళ్లే పేద ముస్లింల ఖర్చు ప్రభుత్వమే భరించేదన్నారు. రంజాన్ పండుగ నాడు పేద ముస్లింలకు రంజాన్‌తోఫా పేరిట సరుకులను అందించామన్నారు. అయితే జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వాటన్నింటినీ రద్దు చేసిందని మండిపడ్డారు. కనుక వచ్చే ఎన్నికల్లో ముస్లిం మైనార్టీలు ఆలోచించి వైసీపీకి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కూటమి గెలుపునకు కృషి చేయాలని కోరారు. అనంతరం ముస్లిం మైనార్టీలు పల్లెను శాలువా, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, మండల కన్వీనర్ శెట్టివారి జయచంద్ర, మాజీ జడ్పీటీసీ పిట్టా ఓబుళరెడ్డి, మైనార్టీ నాయకులు మండోజీ ఆర్ఫీఖాన్, పొగాకు షబ్బీర్, షేక్‌నిజాం, ఆర్‌ఎంపీ జాకీర్, పొగాకు షాన్వాజ్, చాంద్‌బాషా, చికెన్‌షాను,ఇర్షాద్, తుమ్మల మహబూబ్‌బాషా, అఖిల, ముంతాజ్, తెలుగుయువత నాయకులు బూదిలిఓబులరెడ్డి, పీట్ల సుధాకర్, మీసేవసుధాకర్, కంచి సురేష్, సుధాకర్ రెడ్డి, గంటా శ్రీనివాసులు, నారప్పరెడ్డి సాంబశివారెడ్డి, అంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సత్యకుమార్‌ను గెలిపించాల్సిన బాధ్యత మనదే

- టీడీపీ శ్రేణులకు పరిటాల శ్రీరామ్ పిలుపు


ముదిగుబ్బలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న పరిటాల శ్రీరామ్

ముదిగుబ్బ, మార్చి31: ధర్మవరం అసెంబ్లీ నియోజకవర్గంలో కూటమి అభ్యర్థిగా బరిలోకి దిగుతున్న సత్యకుమార్‌ను అఖండ మెజారిటీతో గెలిపించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాలశ్రీరామ్ పిలుపునిచ్చారు. ముదిగుబ్బ మండల కేంద్రంలో ఆదివారం ఆయన పార్టీ మండల నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. నాలుగేళ్లుగా మనం నియోజకవర్గం లో ప్రతి గ్రామానికి వెళ్లి ఎంతో కష్టపడి పని చేశామని గుర్తు చేశారు. కొన్ని అనుకోని కారణాల వల్ల టికెట్ బీజేపీకి పోయిందన్నారు. అయినప్పటికీ మనం మాట ఇచ్చి సత్యకుమార్‌ను ఇక్కడకి తీసుకొచ్చామని, ఇప్పుడు ఆయన్ను గెలిపించాల్సిన బాధ్యత మనపై ఉందని తెలిపారు. గతంలో తాను ఇచ్చిన హామీలన్నీ సత్యకుమార్ ద్వారా అమలు చేయిస్తానని పేర్కొన్నారు. ఈ విషయంలో మాట తప్పే ప్రసక్తే లేదని అన్నారు. ధర్మవరం చరిత్రలో మొట్టమొదటిసారిగా ఒక బీసీ అభ్యర్థి ఎన్నికల బరిలో నిలబడుతున్నారని, నియోజకవర్గంలో ఉన్న బీసీలంతా ఆయనకు మద్దతు తెలపాలని కోరారు. మనం చేసిన త్యాగం వృథా పోకూడదని, సత్యకుమార్‌ను గెలిపిస్తేనే మనం చేసిన త్యాగానికి న్యాయం జరుగుతుందని శ్రీరామ్ అభిప్రాయపడ్డారు. ధర్మవరంలో మరోసారి రాక్షస పాలన రాకుండా పని చేయాల్సిన అవసరం ఉందన్నారు కేవలం 40 రోజులు మాత్రమే సమయం ఉందని, ఇప్పటి నుంచే క్షేత్రస్థాయికి వెళ్లి కూటమి అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో పెద్దఎత్తున నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మైనార్టీలకు అండగా ఉంటాం

ధర్మవరం: నియోజకవర్గంలో ముస్లి మైనార్టీలకు అండగా ఉంటామని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం ఆయన ముస్లిం మైనార్టీలతో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. నియోజకవర్గంలో ప్రతి ముస్లి మైనార్టీ కుటుంబానికి తాను అండగా ఉంటానన్నారు. ఇక్కడ టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న సత్యకుమార్‌ను ముస్లిం సోదరులందరూ ఆశీర్వదించాలని కోరారు. ఈనెల 4న సత్యకుమార్ ధర్మవరం వస్తున్నారని, ఆయనకు స్వాగతం పలకడానికి భారీ ఎత్తున ముస్లింలు తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ముస్లిం మైనార్టీలు నాగూర్‌హుస్సేన్, రాళ్లపల్లి షరీఫ్, అత్తార్‌రహీంబాషా, రావులచెరువు కుళ్లాయప్ప, ఇర్షాద్ తదితరులు పాల్గొన్నారు.



మైనార్టీలతో మాట్లాడుతున్న పరిటాల శ్రీరామ్

పలు గ్రామాల్లో కందికుంట ప్రచారం


రెడ్డిమోళ్లపల్లిలో కందికుంటకు పూలమాల వేసి స్వాగతం పలుకుతున్న దృశ్యం

కదిరి, మార్చి 31: రానున్న ఎన్నికల్లో తనను ఆశీర్వదించాలంటూ కందికుంట వెంకటప్రసాద్ ఓటర్లను అభ్యర్థించారు. తలుపుల మండలంలోని గొల్లపల్లి, రెడ్డిమోళ్లపల్లి, గొందిపల్లి, బాల్‌రెడ్డిగారిపల్లిలో ఆదివారం ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే చేపట్టబోయే సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు వివరించారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి తనను భారీ మెజారిటీతో గెలిపించాలని, నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని తెలిపారు. ఆయనకు ప్రతి గ్రామంలోనూ గ్రామస్థులు, టీడీపీ శ్రేణులు హారతులు, పూలమాలలతో ఘన స్వాగతం పలికారు. పీవీ పవన్‌కుమార్‌రెడ్డి, మండల కన్వీనర్ ముబారక్, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీలోకి 20మంది చేరిక


టీడీపీలో చేరిన వారితో పల్లె

నల్లమాడ, మార్చి 31: మండలంలోని కురమాల గ్రామంలో ఆదివారం వైసీపీ శ్రేణులు 20మంది మాజీ మంత్రిపల్లె రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారందరికి పల్లె కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. చేరినవారిలో మాజీ సర్పంచ్ పెద్ద ఓబులేసు, మాజీ డీలర్ ఓబులపల్లి భరత్, వెంకటరమణ, మంజుల, నారాయణప్ప, గంగాదేవి, కళావతి, సాలెమ్మ, భాగ్యమ్మ, లక్ష్మీనరసమ్మ, ప్రశాంతనాయక్, లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, మండలకన్వీనర్ మైలే శివశంకర్, మాజీ కన్వీనర్ కేశరెడ్డి, నాయకులు మహబూబ్‌బాషా, గంగన్న, రమణప్ప, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అమగొండపాలెంలో ఎన్నికల ప్రచారం

పుట్టపర్తి రూరల్ : మండలంలోని అమగొండపాలెంతో పాటు అదే పంచాయతీలోని రాగేపల్లిలో మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ చంద్రబాబు ప్రకటించిన మినీ మేనిఫెస్టో పథకాలను ప్రజలకు తెలియచేస్తూ కరపత్రాలు పంచారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి పల్లె సింధూరా రెడ్డిని అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. అమగొండపాలెం మాజీ ఉపసర్పంచు ఎం ప్రసాద్, బీ ప్రసాద్ కుటుంబాలు పల్లె ఆధ్వర్యంలో తెలుగుదేశంలోకి చేరారు. కార్యక్రమంలో నాయకులు సామకోటి ఆదినారాయణ, శ్రీరామిరెడ్డి, బొమ్మయ్య, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

కొత్తచెరువు: మండలంలోని గుంటిపల్లికి చెందిన లెక్కల పెద్దసుబ్బన్న(70) అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రిపల్లెరఘునాథరెడ్డి ఆదివారం గ్రామానికి వెళ్లి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను ఓదార్చారు. ఆయన వెంట మాజీ ఎంపీటీసీ సుధాకర్, నాయకులు సాలక్కగారి శ్రీనివాసులు, విశ్వనాథ్ , వెంకటేశ్, రామకృష్ణ, ఒలిపిశీన, సురేశ్ ఉన్నారు.

జీవకోటికి ప్రాణాధారం నీరు

పెనుకొండ, మార్చి 31 : జీవకోటికి ప్రాణాధారమైన నీటిని వృథా చేయకండని, పొదుపు చేయాలని జన విజ్ఞాన వేదిక నాయకులు పేర్కొన్నారు. ప్రపంచ జల వారోత్సవాలను పురస్కరించుకుని స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో ఆదివారం వారు నీటి పొదుపుపై ముద్రించిన కరపత్రాలను విడుదల చేశారు. జేవీవీ జిల్లా కార్యదర్శి హరీష్, జోనల్ కార్యదర్శి ఇమ్రాన్ మాట్లాడుతూ జీవకోటి మనుగడకు నీరు ఎంతో అవసరమన్నారు. ప్రజలు నీటి ప్రాధాన్యతను గుర్తించి సంరక్షించుకోవాలన్నారు. అనంతరం కరపత్రాలు పంచిపెట్టారు.

చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ

ఓబుళదేవరచెరువు, మార్చి 31: మండలకేంద్రంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో కొత్తపల్లి బాషా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆదివారం ఎంపీపీ తుమ్మల ఫర్వీన్‌షామీర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుతం ఎండలు మండుతుండడంతో బాటసారుల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. టీడీపీ నాయకులు నిజాం, బొట్టు జయన్న, సర్పంచ్ గోవిందు, తంగేడుకుంట రఫీక్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం ప్రజలకు అండగా ఉంటా..

- ఆత్మీయ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల


సమావేశంలో మాట్లాడుతున్న గోనుగుంట్ల సూర్యనారాయణ

ధర్మవరం, మార్చి31: అధికారం ఉన్నా.. లేకపోయినా ప్రాణం ఉన్నంత వరకు ధర్మవరం నియోజకవర్గ ప్రజలకు అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ పేర్కొన్నారు. ధర్మవరం పట్టణంలోని తన కార్యాలయంలో ఆదివారం ఆయన నియోజ కవర్గంలోని తన వర్గీయులు, అభిమానులతో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. తర్వాత మాట్లాడుతూ.. ధర్మవరానికి, తనకు ఎంతో అనుబంధం ఉందన్నారు. 2009 నుంచి 2014 వరకు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలో నియోజకవర్గంలో పది హత్యలు జరిగాయని, అప్పట్లో టీడీపీ ఇన్‌చార్జిగా ఉన్న తాను ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేశానని అన్నారు. ఆ తరువాత 2014లో భారీ మెజారిటీతో గెలుపొంది ఐదేళ్లలో నియోజకవర్గాన్ని రూ.4500 కోట్లతో అన్ని విధాలా అభివృద్ధి చేశామన్నారు. నేతన్నలకు, రైతులకు అండగా నిలిచామన్నారు. ప్రతి గ్రామంలో తారు రోడ్లు వేశామన్నారు. ఫ్యాక్షన్‌ను రూపుమాపి నియోజకవర్గంలో శాంతి కుసుమాలు నెలకొల్పామన్నారు. తాను గెలిచిన తర్వాత కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి మూడేళ్ల నియోజకవర్గాన్ని వదిలేసి పరారయ్యారని గుర్తు చేశారు. ఆ తరువాత వచ్చి ప్రజలకు అమలు కాని హామీలిచ్చి మోసం చేసి 2019లో గెలిచారన్నారు. గుడ్ మార్నింగ్ పేరుతో భూకబ్జాలు చేశారన్నారు. ఇంతటి అన్యాయం పాలన చేసిన కేతిరెడ్డి నుంచి నియోజకవర్గ ప్రజలకు విముక్తి కలిగించడానికి తాము ఇప్పటికీ కట్టుబడి ఉన్నామన్నారు. అధికారం ఉన్నా.. లేకున్నా.. నియోజకవర్గ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటానని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు డిష్‌రాజు, చిగిచెర్ల అరవిందరెడ్డి, తుంపర్తి పరమేశ్, బోడగల గిరిధర్, నబీరసూల్, దుస్సాక్రిష్ణ, రాప్తాటి రాము, బెస్తశివ, నబీరసూల్, నారాయణస్వామి యాదవ్, మార్కెట్ రహీం, చిలకం సూర్యనారాయణరెడ్డి, ముదిగుబ్బ నారాయణస్వామి, సాహెబ్బీ, గరుగుపద్మావతి తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం


తాటిమాను గుంతలో సూపర్ సిక్స్‌పై ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

నంబులపూలకుంట, మార్చి 31: మండలంలోని తాటిమానుగుంత గ్రామంలో టీడీపీ నాయకులు సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి ప్రజలకు కరపత్రాలు పంచుతూ పథకాల గురించి వివరించారు. కుటుంబంలో ఎవరెవరికి ఏయే పథకాల వర్తిస్థాయి.. ఏ మేరకు లబ్ధి చూకూరుతుందో తెలియజేశారు. ఈ పథకాల వల్ల అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని అన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ విజయానికి కృషి చేయాలని కోరారు. చంద్రబాబు సీఎం అయితే రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ఎమ్మెల్యేగా కందికుంట వెంకటప్రసాద్‌ను, ఎంపీగా బీకే పార్థసారధిని అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓబుళదేవరచెరువు: మండలంలోని బోయపల్లిలో సూపర్ సిక్స్ పథకాలపై టీడీపీ సీనియర్ నాయకుడు బోయపల్లి శివారెడ్డి, కార్యకర్తలతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి టీడీపీ అధికారంలోకి వస్తే చేపట్టబోయే సంక్షేమ పథకాల గురించి ప్రజలకు కరత్రాలతో ప్రచారం చేశారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి పల్లె సింధూరారెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బూత్ కన్వీనర్ రమణ, నాయకులు మునిస్వామి, లక్ష్మీనరసప్ప, శీన, అశోక్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రామాపురం తండాలో తాగునీటి ఎద్దడి

- ఇబ్బంది పడుతున్న స్థానికులు

నంబులపూలకుంట, మార్చి 31: మండలంలోని రామాపురం తండాలో గత పదిరోజులుగా తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉన్నట్లు గ్రామస్థులు వాపోతున్నారు. బోరులో భూగర్భజలాలు అడుగంటిపోవడం, తాగునీటి పథకంలో చుక్కనీరు రాకపోవడంతో సమస్య తెలిత్తిందని అంటున్నారు. దీంతో చేసేదిలేక నీటి కోసం సమీపంలోని వ్యవసాయ పొలాల వద్దకు పరుగులు తీయాల్సి వస్తోందంటున్నారు. పాడి పశువులపై ఆధారపడి జీవనం సాగిస్తున్న మాకు నీటి ఎద్దడి కారణంగా జీవనోపాధి సైతం దెబ్బతింటోందని అంటున్నారు. పశువుల దాహార్తి తీర్చడానికి కూడా నీరు కరువైందన్నారు. పలుమార్లు సమస్యను అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. పొలాల వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకోవడానికే రోజంతా సరిపోతోందంటున్నారు. ఇక పనులకు ఎప్పుడు వెళ్లాలని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

వ్యవసాయంపై లండన్ విద్యార్థులకు అవగాహన

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 31: లండన్‌లోని కింగ్స్ కాలేజ్‌కి చెందిన విద్యార్థులు సహజ వ్యవసాయ విధానాలపై అవగాహన పొందుతున్నారు. కింగ్స్ గ్లోబల్ డే ఆఫ్ సర్వీస్, ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ (ఆసియోన్ ఫ్రాటెర్నా) సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక రాప్తాడు మండలం రామినేపల్లి గ్రామంలో రైతులతో ముఖాముఖిలో లండన్ విద్యార్థులు గివింగ్ బ్యాక్ టు సొసైటీ ప్రచారంలో భాగంగా సహజ వ్యవసాయ విధానాలపై వివరించారు. ఆవు పేడ, బెల్లం, పుట్ట నుంచి మట్టి, ఆవు మూత్రంతోపాటు పాడి పప్పును పిండి చేశారు. అనంతరం అక్కడ నుంచి ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ వరకు రైతులు ర్యాలీగా బయలుదేరి వచ్చారు. ఎకాలజీ సెంటర్‌లో కమ్యూనిటీ న్యాచురల్ ఫార్మింగ్ యాప్ పోస్టరు విడుదల, రైతు అవార్డులు ప్రదానం చేశారు. కరవు జిల్లాలో సామాజిక సహజ వ్యవసాయంతో అనేక లాభాలు, ప్రయోజనాలు ఉన్నాయని గ్రహించి అవగాహన కల్పించేందుకు లండన్ నుంచి ఇక్కడికి రావడం అభినందనీయమని ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ మల్లారెడ్డి అన్నారు. జిల్లాలో వ్యవసాయానికి అనుకూలంగా నేలలు, పరిస్థితులు ఉన్నాయని లండన్ కింగ్స్ కాలేజ్ పూర్వ విద్యార్థుల సంఘం వ్యవస్థాపకుడు స్టీఫెన్ అనురాగ్ తెలిపారు. సస్టెయినబుల్ అగ్రికల్చర్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ రుద్రయ్య, ఏఎఫ్ ఎకాలజీ సీఎస్ఎఫ్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఖలీల్‌అహ్మద్, సంఘం సభ్యులు హర్ సహాయ్ మీనా, అకాష్ పొద్దార్, తేజ త్రిభునవ్ బోయ, జాకీర్‌హుస్సేన్, సాహిల్‌ఖాదర్, హర్ష సాకే, అఖిల్‌రవి, ఇంద్రజ పాల్గొన్నారు.


సహజ వ్యవసాయ విధానాలపై అవగాహన కల్పిస్తున్న నిపుణులు

ఘనంగా ఈస్టర్ వేడుకలు

పుట్టపర్తి రూరల్, మార్చి 31: మండలంలోని పలు చర్చిల్లో ఆదివారం క్రైస్తవులు ఘనంగా ఈస్టర్ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. కర్ణాటకనాగేపల్లి కింగ్స్‌చర్చిలో పాస్టర్లు అరుణ్ కుమార్, సలోమి మాట్లాడుతూ యేసుక్రీస్తు మానవులను పాపాల నుంచి రక్షించేందుకు శిలువ రూపంలో మరణించి తిరిగి మూడవ రోజున (ఈస్టర్‌రోజున) పునరుత్థానుడై లేచినట్లు వివరించారు. ఈపర్వదినాన్ని పురస్కరించుకొని యేసుప్రభువు పునరుత్థానం గురించి బైబిల్‌లోని వాక్యలను బోధించారు.

ఓబుళదేవరచెరువు: మండలకేంద్రంలోని సీఅండ్ఐజీ మిషన్ చర్చిలో ఈస్టర్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా క్రైస్తవులు చర్చిని పూలతో అలంకరించి, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్ గేయానంద్ ఈస్టర్ ప్రత్యేకతను వివరించారు. చర్చి కార్యదర్శి దార్ల రాజశేఖర్, సభ్యులు బాలరాజు, సునిల్‌కుమార్, సు ధారాణి, ఆశీర్వాదమ్మ, సుగుణమ్మ, కమలమ్మ పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు సౌకర్యాలు కల్పించండి

తనకల్లు, మార్చి 31: మండలంలోని వివిధ గ్రామాల్లో పని చేస్తున్న ఉపాధి హామీ కూలీలకు పని ప్రదేశంలో సౌకర్యాలు కల్పించాలని ఎంపీడీఓ పూల నరసింహులు సంబంధిత అధికారులను ఆదేశించారు. మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఆదివారం ఆయన ఉపాధి హామీ సిబ్బంది, అధికారులతో సమీక్ష జరిపారు. వేసవిలో ఎండలు తీవ్రంగా ఉండడంతో కూలీలకు పని ప్రాంతంలో నీడ, నీరు, ప్రథమచికిత్స కిట్లను ఏర్పాటు చేయాలన్నారు. ఫీల్డు అసిస్టెంట్లు, సాంకేతిక సహాయకులు కూలీల సంఖ్య పెంచడానికి ప్రయత్నించాలన్నారు. కూలీల సంఖ్య పెరగకపోతే వేటు తప్పదని హెచ్చరించారు. సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

పాలిసెట్‌కు ఉచిత శిక్షణ

కదిరిఅర్బన్, మార్చి 31: పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 1నుంచి 25వ తేదీ వరకు ఉచితంగా పాలిసెట్ 2024కు శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రిన్సిపాల్ నారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణకు హాజరయ్యే విద్యార్థులకు ఉచిత స్టడీ మెటీరియల్‌కూడా అందజేస్తామన్నారు. మరింత సమాచారం కోసం 9010222175 నంబరులో సంప్రదించాలన్నారు.

57 మందికి కంటి వైద్య పరీక్షలు


కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

ధర్మవరం, మార్చి 31: పట్టణంలోని బాలుర ఉన్నతపాఠశాలలో ఆదివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఇందులో 57 మందికి కంటి వైద్యుడు నాగేంద్ర కంటి పరీక్షలు నిర్వహించారు. 32 మందిని శస్త్రచికిత్సలకు ఎంపికచేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులుగూడూరు మోహన్‌దాసు, రాజగోపాల్, సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా కైవారం తాతయ్య జయంత్యుత్సవాలు

హిందూపురం అర్బన్, మార్చి 31: సిద్ధయోగీశ్వరులు, కైవారం తాతయ్య 299వ జయంత్యుత్స వాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ప ట్టణ పరిధిలోని నా నెప్పనగర్ కేవీఆర్ ఫంక్షన్ హాల్‌లో ఆది వారం యోగి నారే యణ సేవాసమితి ఆ ధ్వర్యంలో ఆ సంస్థ హిందూపురం అధ్యక్షుడు రవిశంకర్ నేతృత్వంలో జయం త్యుత్సవాలు జరిగాయి. తెల్లవారు నుంచే తాతయ్య విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గోపూజ, భజనలు చేశారు. మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో కోన కణ్వాశ్రమం పీఠాధిపతి చంద్రాస్వామి, రాజ్యలక్ష్మీ మోహన్, వెంకటపతి, వెంకటేష్, మహేష్, ప్రదీప్, అనీల్, వెంకటాద్రి, నాగరాజు, శ్రీరాములు, పనప్ప, పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.


ప్రత్యేక పూజలందుకున్నకైవారం తాతయ్య విగ్రహం

ఘనంగా ఎల్లమ్మ దేవత మండల పూజ


ప్రత్యేక అలంకరణలో రేణుకా ఎల్లమ్మ మూలవిరాట్

గోరంట్ల, మార్చి 31: పట్టణంలోని రేణుకా యల్లమ్మ ఆలయంలో మండల పూజ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈడిగ గౌడ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ జరిపి 48రోజులు పూర్తికావడంతో అర్చకులు నాగేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమానికి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత, మాజీ సర్పంచ్ నిమ్మల చంద్రశేఖర్ ముఖ్య అతిథులుగా హాజరై పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

'నిబంధనలు పాటించని కోచింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలి'

గోరంట్ల, మార్చి 31: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న పాలిటెక్నిక్, ఏపీఆర్‌జేసీ కోచింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలని ప్రగతి శీల విద్యార్థిసంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి చంద్ర ఆదివారం ప్రకటనలో డిమాండ్ చేశారు. జిల్లావ్యాప్తంగా హిందూపురం, పెనుకొండ, గోరంట్ల ప్రాంతాల్లో పలు ప్రయివేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో చట్ట విరుద్ధంగా కోచింగ్ సెంటర్లు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. నెలరోజుల శిక్షణ కోసం ఒక్కొక్క విద్యార్థినుంచి రూ. మూడువేల నుంచి రూ. ఐదువేలు వసూలు చేస్తున్నారన్నారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులతో శిక్షణ ఇస్తున్నామని విద్యార్థుల డేటా సేకరించి, ప్రయివేటు పాలిటెక్నిక్ కళాశాల యజమాన్యానికి సమాచారం ఇచ్చి రూ.లక్షల్లో ఆర్జిస్తున్నట్లు ఆరోపించారు. సబంధిత అధికారులు వెంటనే విచారణ జరిపి చర్యలు చేపట్టడంతోపాటు వారి అనుమతులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

జీవకోటికి ప్రాణాధారం నీరు

పెనుకొండ, మార్చి 31: జీవకోటికి ప్రాణాదారమైన నీటిని వృథా చేయకండని, పొదుపు చేయాలని జన విజ్ఞాన వేదిక నాయకులు పేర్కొన్నారు. ప్రపంచ జల వారోత్సవాలను పురస్కరించుకుని జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం నీటి పొదుపుపై ముద్రించిన కరపత్రాలను విడుదల చేశారు. స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో జేవీవీ జిల్లా కార్యదర్శి హరీష్, జోనల్ కార్యదర్శి ఇమ్రాన్, రమేష్, ఇలియాజ్, హాజీ, వెంకటేష్ తదితరులు కరపత్రాలు విడుదల చేశారు. జీవకోటి మనుగడకు త్రివిధ మూలాధారాలలో నీరు రెండోదన్నారు. ప్రజలంతా తమవంతు బాధ్యతగా నీటి ప్రాధాన్యతను గుర్తించి సంరక్షించుకోవాలన్నారు. అనంతరం బస్సులు, ఆటోలు, వాహనాల్లో కరపత్రాలు పంచిపెట్టారు.

బాధితులకు సవిత పరామర్శ

గోరంట్ల, మార్చి 31: పట్టణంలోని పులేరు రహదారిలో సంచార జాతికి చెందిన రామక్క, ఆంజనప్పల గుడారం అగ్ని ప్రమాదంలో కాలి బూడిదైన విషయం విదితమే. విషయం తెలుసుకున్న టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత ఆదివారం అక్కడికి వెళ్లి బాధితులను పరామర్శించారు. ప్రమాదంలో నగదు, ఇంటిసామాగ్రి పూర్తిగా కాలిపోవడంతో రూ.రెండులక్షల నష్టం జరిగింది. విషయం తెలుసుకు్న ఆమె బాధితులతో మాట్లాడారు. అధైర్యవద్దని, వచ్చేది టీడీపీ ప్రభుత్వమే అని అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. తనవంతుగా ఆర్థికసాయం చేశారు. ఆమెతోపాటు మండలక న్వీనర్ సోముశేఖర్, మాజీ సర్పంచ్ నిమ్మల చంద్రశేఖర్, మాజీ ఎంపీటీసీ నిమ్మల యువశేఖర్, నాయకులు, కార్యకర్తలున్నారు.

కార్యకర్తలకు టీడీపీ అండ: గుండుమల


నివాళులర్పిస్తున్న గుండుమల తిప్పేస్వామి

మడకశిర రూరల్, మార్చి 31: కార్యకర్తలకు తెలుగు దేశం పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి పేర్కొన్నారు. మండలంలోని మరువపల్లిలో టీడీపీ యూనిట్ ఇన్‌చార్జి వెంకటాద్రి తండ్రి, పార్టీ సీనియర్ నాయకుడు దాసప్ప ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న గుండుమల తిప్పేస్వామి ఆగ్రామానికి వెళ్లి దాసప్ప మృతదేహంపై పూలమాలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. నాయకులకు, కార్యకర్తలకు టీడీపీ అండగా ఉంటుందన్నారు. ఆయన వెంట మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, క్లస్టర్ ఇన్‌చార్జ్ నాగరాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

- మరొకరికి గాయాలు


శంకర్ మృతదేహం

మడకశిరటౌన్, మార్చి 31: మడకశిర మండలం ఆమిదాలగొంది గ్రామ సమీపంలో ఆదివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో కర్ణాటక రాష్ట్రం చెళ్లకెరె నియోజకవర్గం గౌరీపురానికి చెందిన శంకర్(45) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మరో వ్యక్తి వన్నూరప్పకు గాయాలుకాగా మడకశిర ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఏఎస్ఐ బ్రహ్మానందరెడ్డి సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఏఎస్ఐ అందించిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రంలోని గౌరీపురానికి చెందిన శంకర్, వన్నూరప్ప ఇద్దరూ ద్విచక్ర వహనంలో పెనుకొండ నియోజకవర్గం రొప్పాల గ్రామానికి బయలుదేరారు. వారు కర్ణాటక రాష్ట్రం రాజవంతి నుంచి ఆమిదాలగొందికి వెళ్తున్నారు. అదే సమయంలో మడకశిర మండలంలోని అచ్చంపల్లి నుంచి బియ్యం లోడుతో మడకశిర వైపు వెళ్తున్న లారీ ఢీకొనడంతో శంకర్ అక్కడికక్కడే మృతి చెందగా వన్నూరప్పకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే వన్నూరప్పను మడకశిర ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్సలు అందిస్తున్నారు. మృతుడికి భార్య, నలుగురు పిల్లలు ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రమాదానికి గురైన లారీని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఏఎస్ఐ తెలిపారు.

మరోసారి జగన్ గెలిస్తే పాలేగాళ్ల పాలనే

జయహో బీసీ సభలో టీడీపీ ఎంపీ అభ్యర్థి బీకే


సమావేశంలో మాట్లాడుతున్న బీకే పార్థసారథి

లేపాక్షి, మార్చి 31 : ఒక్క చాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని అల్లకల్లోలం చేశాడని, మరోసారి అవకాశం ఇస్తే రాష్ట్రంలో పాలేగాళ్ల పాలన చూడాల్సి ఉంటుందని టీడీపీ హిందూపురం ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథి అన్నారు. ఆయన ఆదివారం లేపాక్షిలోని ఆర్‌జే హెచ్ ఫంక్షన్‌హాల్‌లో జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ మండల కన్వీనర్ జయప్ప ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జనసేన, బీజేపీ, టీడీపీ నాయకులు వందలాది మంది తరలివచ్చారు. ఈ సందర్భంగా పార్థసారథి మాట్లాడుతూ.... రాష్ట్రం జగన్‌చేతిలోకి వెళ్లాక అప్పుల పాలైందని , అభివృద్ధి ఏమాత్రం కనబడటంలేదని విమర్శించారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా, బీసీలకు న్యాయం జరగాలన్నా చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. అధికారులను గుప్పెట్లో పెట్టుకుని వైసీపీ నాయకులు ఇష్టానుసారంగా చెలరేగుతున్నారన్నారు. ప్రశ్నించిన వారిపై తప్పుడు కేసులు బనాయించి ఇబ్బందులకు గురిచేయడమే ప్రధాన లక్ష్యంగా పనిచేశారన్నారు. ఇల్లులేని నిరుపేదలకు పక్కా ఇళ్ల టీడీపీతోనే సాధ్యమన్నారు. ఇంటింటికీ వెళ్లి సూపర్‌సిక్స్ పథకాలపై వివరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్‌యార్డ్ చైర్మన్ కిష్టప్ప, నాయకులు మారుతిప్రసాద్, మాజీ ఎంపీపీ ఆనంద్‌కుమార్, మాజీ ఎంపీటీసీలు, సర్పంచులు, జనసేన నాయకులు, బీజేపీ నాయకులు, తెలుగు తమ్ముళ్లు పాల్గొన్నారు.

గెలుపే ధ్యేయంగా కలిసికట్టుగా పనిచేద్దాం

టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత


సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి సవిత

గోరంట్ల, మార్చి 31: గెలుపే ధ్యేయంగా ఐకమత్యంతో ఎన్నికల్లో పనిచేస్తూ వైసీపీని తరిమికొట్టాలని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గోరంట్లలోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో పంచాయతీల వారీగా సమీక్షించారు. పార్టీలో ఎన్ని విభేదాలున్నా, కుటుంబ సమస్యగా భావించి కలిసి కట్టుగా ముందుకెళ్లాలన్నారు. ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా బీకే పార్థసారథిని గెలిపించి, పార్టీ అధినేత చంద్రబాబునాయుడుకు కానుకగా సమర్పించాలని కోరారు. ఎన్నికలు ముగిసేవరకు నిరంతరం ప్రజలతోనే ఉంటూ సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. అనంతరం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... రాయలసీమ ద్రోహి జగన్మోహన్‌రెడ్డి కి జిల్లాలో పర్యటించే నైతిక హక్కు, అర్హత లేదన్నారు. ఒక్క చాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చి, రాష్ట్రంలో అన్ని వర్గాల అభివృద్ధిని భూస్థాపితం చేశాడన్నారు. లేపాక్షి హబ్ పేరుతో చిలమత్తూరు వద్ద 8,800 ఎకరాల రైతుల భూములు తీసుకుని ఏమి చేశారని ప్రశ్నించారు. వైసీపీ పాలనకు భయపడి కియ అనుబంధ పరిశ్రమలు జిల్లాకు రాకుండా తరలిపోయాయన్నారు. రాయలసీమ ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్వాహణను పూర్తిగా వదిలేశారన్నారు. అలాంటప్పుడు ఏ ముఖం పెట్టుకుని జిల్లా ప్రజలను ఓట్లు అడగడానికి వస్తున్నారన్నారు. గతంలో టీడీపీ చేసిన అభివృద్ధి వల్లే గ్రామాల్లో తమకు బ్రహ్మరథం పడుతున్నారని, వైసీపీ వారు కూడా స్వాగతిస్తున్నారన్నారు. వైసీపీ అభ్యర్థి ఉషశ్రీ చరణ్ ఉద్యోగులను, వలంటీర్లను బెదిరిస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. జనసేన, బీజేపీ, టీడీపీ కూటమికి పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు. బటన్ రెడ్డికి బటన్ నొక్కి సాగనంపేందుకు రోజులు దగ్గరపడ్డాయన్నారు. ఈకార్యక్రమంలో టీడీపీ మండలకన్వీనర్ సోముశేఖర్, నాయకులు సుధాకర్‌రెడ్డి, బాలక్రిష్ణచౌదరి, నరేష్, ఉత్తమరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీసీల అభివృద్ధికి పాటుపడిన టీడీపీ

మడకశిర ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్‌కుమార్


ప్రచారంలో మాట్లాడుతున్న సునీల్‌కుమార్

మడకశిరటౌన్, మార్చి 31: బీసీలను ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధి చేసింది తెలుగుదేశం పార్టీనేనని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్‌కుమార్ పేర్కొన్నారు. ఆయన ఆదివారం అమరాపురం మండల కేంద్రంలో జయహో బీసీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ముందుగా భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మద్దనకుంట ఈరన్నతో సునీల్ కుమార్ పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక బీసీలను అన్ని రంగాల్లో అణగదొక్కిన ఘనుడు జగన్ అన్నారు. బీసీలు ఎదిగితే టీడీపీకి అండగా ఉంటారని, వారి ఎదుగుదలకు అనేక అడ్డంకులను సృష్టించారన్నారు. బీసీల రక్షణ కోసం టీడీపీ అధికారంలోకి వచ్చాక ప్రత్యేక రక్షణ చట్టం తెస్తామన్నారు. జగన్ ప్రభుత్వం రూ.75వేల కోట్ల బీసీ సబ్‌ప్లాన్ నిధులను దారి మళ్లించిందని, చంద్రబాబు ముఖ్యమంత్రికాగానే ఆ నిధులు బీసీలకు అందేలా చట్టం తీసుకుంటామన్నారు. అలాగే బీసీలకు 50 సంవత్సరాలకే పింఛను అమలు చేసి, రూ.4వేలకు పెంచుతామన్నారు. బీసీలు అభివృద్ధికి ప్రత్యేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తామన్నారు. ముఖ్యమంత్రి జగన్ పేరుకే 56 కార్పొరే షన్‌లు ఏర్పాటు చేసి చైర్మన్‌లను అలంకార ప్రాయంగా చేశారన్నారు. బీసీలపై ఏ మాత్రం ప్రేమ, చిత్తశుద్ధి ఉంటే వారికి న్యాయం చేసేవారన్నారు. జగన్ ఎన్ని కుట్రలు పన్నినా బీసీలను టీడీపీ నుంచి వేరుచేయలేరన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మద్దనకుంట ఈరన్నతో కలిసి అమరాపురం మండల కేంద్రంలో ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీసీ సాధికారత కన్వీనర్ వీఎం పాండురంగప్ప, ఉగ్రనరసింహప్ప, మాజీ జడ్పీటీసీ నరసింహమూర్తి, మాజీ ఎంపీపీ కృష్ణమూర్తి, ఆదినారాయణ, రామాంజనేయులు తదితరులు ఉన్నారు.

ప్రజాసంక్షేమాన్ని విస్మరించిన వైసీపీ : మాజీ ఎమ్మెల్యే

గుడిబండ: చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని మాజీ ఎమ్మెల్యే ఈరన్న పేర్కొన్నారు. ఆయన ఆదివారం మండలంలోని ముదుకూరు పంచాయతీ లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చి ప్రజా సంక్షేమాన్ని విస్మరించిందని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కలిసికట్టుగా పనిచేసి టీడీపీ విజయానికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సుధాకర్, మారేగౌడ్, జయరాంరెడ్డి, సిద్దేశ్వరప్ప, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

కంకరతేలిన రోడ్డుతో ఇబ్బందులు


కంకరతేలిన తారు రోడ్డు ఇదే

అగళి, మార్చి 31 : ఈ రోడ్డులో నరడవలేక పోతున్నామని మండలపరిధిలోని గాయత్రి కాలనీవాసులు రాజన్న, రాజేష్, జయమ్మ, దాదన్న, రాజునాయక్, మల్లికార్జున తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. వారు ఆదివారం మాట్లాడుతూ... మండలకేంద్రలోని మండే మారెమ్మ గుడి దగ్గర నుంచి గాయత్రి కాలనీ వరకు ఈ తారురోడ్డు పూర్తిగా అధ్వానంగా మారిందన్నారు. దీనిని పట్టించుకునే వారే లేరని ఆవేదన వ్యక్తం చేశారు. ద్విచక్రవాహనాలు, ఫోర్ వీలర్లతో పాటు ప్రజలు కాలినడకన వెళ్లాలన్నా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు తగు చేపట్టాలని కోరారు.

నేడు జయహో బీసీ కార్యక్రమం

హిందూపురం అర్బన్, మార్చి 31: పట్టణ 7వ క్లస్టర్ పరిధిలో సోమవారం జయహో బీసీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు 7వ క్లస్టర్ ఇన్‌చార్జ్ రాఘవేంద్ర ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పాండురంగనగర్‌లోని కనకదాసు కళ్యాణ మండపం వద్దకు తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు తరలిరావాలని ఆయన కోరారు. ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. తెలుగుదేశం పార్టీ, బీసీ కుల సంఘాలు, బీజేపీ, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలి రావాలని కోరారు.

ఘనంగా కైవారం తాతయ్య జయంత్యుత్సవాలు


ప్రత్యేక పూజలందుకున్న కైవారం తాతయ్య విగ్రహం

హిందూపురం అర్బన్, మార్చి 31: సిద్ధయోగీశ్వరులు, కైవారం తాతయ్య 299వ జయంత్యుత్సవాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పట్టణ పరిధిలోని నాగెప్పనగర్ కేవీఆర్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం యోగి నారేయణ సేవాసమితి ఆధ్వర్యంలో ఆ సంస్థ హిందూపురం అధ్యక్షుడు రవిశంకర్ నేతృత్వంలో జయంత్యుత్సవాలు జరిగాయి. తెల్లవారు నుంచే తాతయ్య విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గోపూజ, భజనలు చేశారు. మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో కోన కణ్వాశ్రమం పీఠాధిపతి చంద్రాస్వామి, రాజ్యలక్ష్మీమోహన్, వెంకటపతి, వెంకటేష్, మహేష్, ప్రదీప్, అనీల్, వెంకటాద్రి, నాగరాజు, శ్రీరాములు, పసప్ప, పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

భక్తిశ్రద్ధలతో ఈస్టర్ వేడుకలు


చర్చిలో ప్రసంగిస్తున్న పాస్టర్ సుధాకర్

పెనుకొండ, మార్చి 31: స్థానిక బైబిల్ మిషన్ చర్చిలో పాస్టర్ సుధాకర్ ఆధ్వర్యంలో ఆదివారం ఈస్టర్ వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. క్రైస్తవులు ఉదయం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా పాస్టర్ ప్రసంగిస్తూ... యేసు పునరుత్థానం గురించి వివరించారు.

బకాయిలు చెల్లించాలి: యూటీఎఫ్

పెనుకొండ, మార్చి 31: గతేడాది ఎస్ఎస్‌సీ స్పాట్ వ్యాల్యుయేషన్ రెమ్యునరేషన్‌ను ప్రభుత్వం ఇంతవరకు చెల్లించలేదనీ, మళ్లీ స్పాట్ వాల్యుయేషన్‌కు రావాలని పేర్కొనడం అన్యాయమని యూటీఎఫ్ నాయకులు పేర్కొన్నారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షప్రధాన కార్యదర్శులు జయచంద్రారెడ్డి, సుధాకర్ ఆదివారం పట్టణంలో మాట్లాడుతూ... గత సంవత్సరం రెమ్యునరేషన్ చెల్లించాలని విద్యాశాఖాధికారులను డిమాండ్ చేశారు. రెమ్యునరేషన్ బకాయిలను నిధుల కొరత వల్ల చెల్లించలేదన్నది అవాస్తవమన్నారు. గతయేడాది చెల్లించాల్సిన మొత్తం రూ.84లక్షలకు గాను ఇప్పటి వరకు రూ.75లక్షలు మాత్రమే చెల్లించారన్నారు. మిగిలిన రూ.9లక్షలు బకాయిలు చెల్లించాలని, అధికారులు స్పందించాలని డిమాండ్‌చేశారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

మడకశిరటౌన్, మార్చి 31: పట్టణ సమీపంలోని తులసీధామ వృద్ధాశ్రమంలో ఆదివారం వృద్ధులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతపురం పట్టణానికి చెందిన ముక్కోటి అంబికా సేవా చారిటబుల్ ట్రస్టు వారి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు వృద్ధాశ్రమ నిర్వాహకులు తిమ్మప్ప తెలిపారు. నిత్యావసర సరుకులు అందజేసినట్లు తెలిపారు.

వ్యవసాయంపై లండన్ విద్యార్థులకు అవగాహన

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 31: లండన్‌లోని కింగ్స్ కాలేజీకి చెందిన విద్యార్థులు సహజ వ్యవసాయ విధానాలపై అవగాహన పొందుతున్నారు. కింగ్స్ గ్లోబల్ డే ఆఫ్ సర్వీస్, ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ (ఆసియోన్ ప్రొటెర్నా) సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక రాప్తాడు మండలం రామినేపల్లి గ్రామంలో రైతులతో ముఖాముఖిలో లండన్ విద్యార్థులు గివింగ్ బ్యాక్ టు సొసైటీ ప్రచారంలో భాగంగా సహజ వ్యవసాయ విధానాలపై వివరించారు.

గుంత తవ్వి.. వదిలేశారు

రైల్వే గేటు వద్ద వృథాగా తాగునీరు


గుంతలో చేరిన పైప్‌లైన్ లీకేజీ నీరు

పెనుకొండ రూరల్, మార్చి 31 : వేసవిలో తాగునీటి పైప్‌లైన్‌ల లీకేజీని అరికట్టాల్సిన మునిసిపల్ అధికారులు, అందుకోసం గోతులుతవ్వి మమ అనిపించుకున్నారు. పెనుకొండ సమీపంలోని తిమ్మాపురం వెళ్లే రైల్వేగేటు వద్ద ఈ దృశ్యం కనిపిస్తుంది. గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి పట్టణానికి తాగునీటిని సరవరా చేసేందుకు గత తెలుగుదేశం పార్టీ హయాంలో పైప్‌లైన్ ఏర్పాటు చేశారు. ఆ ప్రధాన పైప్‌లైన్ స్థానిక తిమ్మాపురం రైల్వే గేటువద్ద లీకేజీ అయి నీరంతా రోడ్లపై ప్రవహిస్తోందని ఆంధ్రజ్యోతిలో రెండురోజుల కిందట కథనం వెలువడింది. అయితే మునిసిపల్ అధికారులు తిమ్మాపురం రైల్వేగేటు వద్ద లీకేజీ అవుతున్న పైప్‌లైన్ మరమ్మతులు చేపట్టలేదు కానీ.... నీరు రోడ్డు పై ప్రవహించకుండా లోతుగా గుంతలు తవ్వి వదిలేశారు. దీంతో పగిలిన పైప్‌లైన్ నుంచి వెలువడే నీరు వృథాగా ఆ గుంతలోకి చేరుతోంది. పగిలిన పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయకపోవడంతో పట్టణానికి తాగునీటి సరఫరాలో కొరత ఏర్పడుతోంది. దీంతో పట్టణంలో తాగునీటి సమస్య తీరలేదు. ఇప్పటికైనా మునిసిపల్ అధికారులు స్పందించి తిమ్మాపురం వద్ద పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టి పట్టణంలో తాగునీటి సమస్య లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

అంబికాకు సవిత సత్కారం


అంబికాను సత్కరిస్తున్న సవిత

పెనుకొండ టౌన్, మార్చి 31 : టీడీపీ అనంతపురం ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీ నారాయణను టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత సన్మానించారు. సోమందేపల్లిలోని టీడీపీ కార్యాలయంలో ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సవిత మాట్లాడుతూ బీసీలకు టీడీపీ సముచిత స్థానం కల్పించిందని ఈ క్రమంలోనే వాల్మీకులకు ఎంపీ స్థానం కేటాయించారన్నారు.

పల్లెలు అభివృద్ధి చెందాలంటే టీడీపీ రావాలి

ఇంటింటి ప్రచారంలో పార్టీ పురం నాయకులు


కొటిపిలో సూపర్‌సిక్స్ పథకాలను వివరిస్తున్న టీడీపీ నాయకులు

హిందూపురం, మార్చి 31 : పల్లెలు అన్ని విధాలా అభివృద్ధి చెందాలంటే తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాల్సిందేనని ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శి సురేంద్ర, మండల కన్వీనర్ అశ్వత్థరెడ్డి, వాణిజ్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అరుణాచలరెడ్డి పేర్కొన్నారు. టీడీపీ నాయకులు ఆదివారం హిందూపురం మండలంలోని కొటిపిలో సూపర్‌సిక్స్ పథకాలపై ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించిచారు. కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో ఉన్న నందమూరి బాలకృష్ణ, ఎంపీ అభ్యర్థి పార్థసారథిని గెలిపించుకోవాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందన్నారు. బాలకృష్ణ మూడోసారి విజయం సాధిస్తే నియోజకవర్గంలోని పల్లెలన్నీ అన్నివిధాలా అభివృద్ధి చెందుతాయన్నారు. ఆయన 2014నుంచి 2019వరకు నియోజకవర్గాన్ని ఏవిధంగా అభివృద్ధి చేశారో వివరించారు. ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్రాన్ని కాపాడుకోవాలన్నా, భవిష్యత్తు తరాలకు మంచి జరగాలన్నా టీడీపీ అధికారంలోకి రావాలన్నారు. లేదంటే రాష్ట్రం అన్నివిధాలా నష్టపోయి, పిల్లల భవిష్యత్తు అంధకారంలో మునుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాజీ జడ్పీటీసీ ఆదినారాయణ, ఉమాశంకర్‌రెడ్డి, బీసీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బేవనహళ్లి ఆనంద్, మాజీ జెడ్పీటీసీ ఆదినారాయణ, ఉమాశంకర్‌రెడ్డి, హెచ్ఎన్‌రాము, అంజనేయులు, మంజునాథ్, బాబిరెడ్డి, సతీష్‌రెడ్డి, నారాయణరెడ్డి, చిక్కిరప్ప, ప్రదీప్, టీజీ నాగరాజు, శంకర్, నగేష్, రామక్రిష్ణ, అంజనరెడ్డి పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి


ముద్దపల్లిలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

చిలమత్తూరు, మార్చి 31: రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు నాయుడు మరోసారి ముఖ్యమంత్రి కావాలని, దీనిని దృష్టిలో పెట్టుకొని త్వరలో జరగబోయే ఎన్నికల్లో టీడీపీని ఆదరించాలని ఆ పార్టీ నాయకులు కోరారు. మండలంలోని మధురేపల్లి, ముద్దపల్లిల్లో టీడీపీ నాయకులు బేకరీ గంగాధర్, శ్రీదేవి, మీసేవ నూరి, మాజీ ఎంపీటీసీ సూర్యనారాయణ, పందిపర్తి గంగాధర, వెంకటేశులు, ఉరుము నంజుండ, తదితరులు ఆదివారం ఇంటింటి ప్రచారం చేశారు. ప్రతి ఇంటికి వెళ్లి టీడీపీ అధికారంలోకి వేస్తే అమలుచేసే సంక్షేమ పథకాలను ఇవరించారు. వైసీపీ ప్రభుత్వం బటన్ నొక్కే పనుల్లో మాత్రమే ఉందని, అయాయక ప్రజలకు అరచేతిలో స్వర్గం చూపిస్తోందన్నారు. దీంతో రాష్ట్రం దివాలా తీయడంతో పాటు సామాన్య ప్రజలు తీవ్రంగా నష్టపోయారన్నారు. సంక్షేమం మాట వరకే కానీ క్షేత్రస్థాయిలో కనపడలేదన్నారు.

వైసీపీ పాలనతో విసిగిపోయిన ప్రజలు : కాంగ్రెస్

హిందూపురం అర్బన్, మార్చి 31: ఒక్క ఛాన్సు ఇస్తే రాష్ట్రాని బాగు చేస్తారని అనుకుని ఓటు వేసి గెలిపించినందుకు, సీఎం జగన్ రాష్ట్రాన్ని రావణ కాష్టం చేశారని కాంగ్రెస్ పార్టీ నాయకులు విమర్శించారు. పట్టణ పరిధిలోని ముద్దిరెడ్డిపల్లి ప్రాంతంలో ఆదివారం ఇంటింటికి కాంగ్రెస్ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రాష్ట్రంలో ఈ ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం సర్వనాశనం అయిందన్నారు. వైసీపీ పాలనతో ప్రజలు విసుగెత్తి పోయారన్నారు. కాంగ్రెస్ తరపున ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఏ బ్లాక్ అధ్యక్షుడు, అమానుల్లా, పట్టణాధ్యక్షుడు జమీల్, నాయములు మహేబూబ్ బాషా, వసుంధరమ్మ, వెంకటేష్, ఎర్రిస్వామి, ముబారక్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థికి ఆప్ మద్దతు


మద్దతు తెలుపుతున్న ఆప్ శిరా, పావగడ నాయకులు

పావగడ, మార్చి 31: కాంగ్రెస్ పార్టీ చిత్రదుర్గం పార్లమెంటు ఎంపీ అభ్యర్థి చంద్రప్పకు ఆమ్ ఆద్మీ పార్టీ తుమకూరు జిల్లా శిరా పావగడ తాలూకాల పదాధికారులు మద్దతు తెలిపారు. దేశ వ్యాప్తంగా ఆమ్ ఆద్మీ పార్టీ కాంగ్రెస్ పార్టీకి మద్దతు ప్రకటించడంతో ఎన్నికలు జరిగే ప్రతిరాష్ట్రంలోనూ తమవంతు సహకారం అందిస్తున్నట్లు ఆప్ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ గౌస్ తెలియజేశారు. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో తుమకూరు, చిత్రదుర్గం పార్లమెంటు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు తమ మద్దతు తెలిపి గెలిపించుకోవడమే తమ లక్ష్యమని ఆయన తెలియజేశారు. ఈసందర్భంగా జిల్లా మహిళా అధ్యక్షురాలు సయ్యద్‌బాను, జిల్లా ప్రధాన కార్యదర్శి మధుసూదన్, శిరా అధ్యక్షుడు మంజునాథ్, పావగడ అధ్యక్షుడు గోపాల్, సోషల్‌మీడియా కన్వీనర్ రాము, తావరేనాయకా, తదితరులు చిత్రదుర్గంకు వెళ్లి తమ మద్దతును చంద్రప్పకు తెలియజేశారు.

హోటల్‌లో పేలిన గ్యాస్ సిలిండర్



పేలుడుతో ధ్వంసమైన హోటల్, దుకాణం

పావగడ, మార్చి 31: తాలూకాలోని అరసికెరె పోలీస్‌స్టేషన్ పరిధిలోని మంగళవాడ గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున ఒక హోటల్‌లో గ్యాస్ సిలిండర్ పేలి రూ.2లక్షల వరకు ఆస్తినష్టం వాటిల్లిందని ఆ హోటల్ యజమానురాలు అనితాలక్ష్మి తెలియజేశారు. ప్రతి రోజూ బస్టాండులోని తన దుకాణంలోనే హోటల్ నిర్వహిస్తున్నానని... అందులో కాఫీ, టీ, భోజనాలు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నట్లు ఆమె తెలిపారు. తన హోటల్ చుట్టుపక్కల చిన్నపాటి దుకాణాలు ఉన్నాయని, సిలిండర్ పేలుడు దెబ్బకు అవికూడా కాలి బూడిదయ్యాయని ఆమె తెలిపారు. వంటసామగ్రి, దుకాణ సామగ్రి దాదాపు రూ.2లక్షల వరకు నష్టం వాటిల్లిం దన్నారు. ప్రభుత్వం చొరవ తీసుకొని తమకు ఆర్థిక సహాయం అందజేయాలని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసస్తున్నట్లు పోలీసులు తెలిపారు.